సింహగిరిపైకి ఎలక్ట్రిక్ బస్సు



... మెయిన్ 3లో

ఎన్నికల్లో ప్రచారం చేశారని ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ సస్పెన్షన్

- సదరు అధ్యాపకురాలు గాజువాక టీడీపీ అభ్యర్థి సతీమణి ... మెయిన్ 2లో

కిర్గిస్థాన్‌లో అల్లర్లతో ఆందోళన - 6లో

వైద్యవిద్యను అభ్యసిస్తున్న పలువురు నగర విద్యార్థులు

కీలకంగా పోస్టల్ ఓట్లు

- ఈ పర్యాయం పోలైన ఓట్లు 22,763
- ఉద్యోగులు 15,450
- అత్యవసర సేవల ఉద్యోగులు 830
- ఇంటి వద్ద నుంచి ఓటు వేసిన వృద్ధులు, దివ్యాంగులు 1,478 మంది
- మొత్తం ఓటర్లలో 1.13 శాతం
- 2019లో పోస్టల్ బ్యాలెట్లు 6,651 ఓట్లు



ఈనెల మొదటివారంలో పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకోవడానికి వచ్చిన ఉద్యోగులు

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి):
ఎన్నికల్లో ఈసారి పోస్టల్ బ్యాలెట్లు కీలకం కానున్నాయి. జిల్లాలో ఉద్యోగులు అధికశాతం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేశారు. ఇంటి నుంచి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే విధానానికి ఈ దఫా ఎన్నికల సంఘం స్వస్తి పలికింది. జిల్లా కేంద్రాలు, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా జిల్లాలోని ఏడు సెగ్మెంట్‌లలో ఉద్యోగులు వేసిన పోస్టల్ బ్యాలెట్‌లలో 6,651 ఓట్లు చెల్లాయి. అప్పుడు 18,81,678 మంది ఓటర్లు ఉండగా...పోస్టల్ బ్యాలెట్ ఓట్లు శాతం కేవలం 0.31. అయితే ఈ పర్యాయం జిల్లాలో 20,12,376 మంది ఓటర్లు ఉండగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకున్నవారి సంఖ్య 22,763. అంటే 1.13 శాతం. వీరిలో జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు 15,450 మంది, అత్యవసర సేవల ఉద్యోగులు 803 మంది, ఇంటి నుంచి ఓటు వేసిన వృద్ధులు, దివ్యాంగులు 1,478 మంది ఉన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సరాసరి వెయ్యికి పైగా ఓట్లు పోలయ్యాయి. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగులు ఓటేశారు. ఈ పర్యాయం వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశామని ఉద్యోగులు బహిరంగంగానే చెబుతున్నారు. అత్యధికంగా నమోదైన ఉద్యోగుల ఓట్లు ఈసారి కొన్ని నియోజకవర్గాల్లో ... మిగతా 6వ పేజీలో

2024లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా పోలైన ఓట్లు

నియోజకవర్గం	ఉద్యోగులు	వృద్ధులు, దివ్యాంగులు	అత్యవసర సేవల సిబ్బంది
భీమిలి	2,366	494	585
విశాఖ తూర్పు	2,716	184	18
విశాఖ దక్షిణ	1,429	136	6
విశాఖ ఉత్తరం	2,307	242	57
విశాఖ పశ్చిమ	1,421	159	51
గాజువాక	2,401	147	19
పెందుర్తి	2,810	116	94
మొత్తం	15,450	1,478	830

2019లో పోస్టల్ బ్యాలెట్లు

విశాఖ పార్లమెంటు నియోజకవర్గం
మొత్తం పోస్టల్ బ్యాలెట్‌లు: 6,708

పార్టీ	ఓట్లు	శాతం
టీడీపీ	1,399	20.79
వైసీపీ	2,938	43.66
జనసేన	1,802	26.78
కాంగ్రెస్	83	1.23
బీజేపీ	462	6.86

1. భీమిలి నియోజకవర్గం
పోస్టల్ బ్యాలెట్‌లు: 1,696

టీడీపీ	319	18.8
వైసీపీ	1,089	64.2
జనసేన	134	7.9
కాంగ్రెస్	20	1.17
బీజేపీ	119	7.01

2. తూర్పు నియోజకవర్గం
పోస్టల్ బ్యాలెట్‌లు :1,063

టీడీపీ	321	30.19
వైసీపీ	643	60.48
జనసేన	67	6.3
కాంగ్రెస్	2	0.18
బీజేపీ	24	2.25

3. దక్షిణ నియోజకవర్గం
పోస్టల్ బ్యాలెట్‌లు: 503

టీడీపీ	146	29.02
వైసీపీ	310	61.63
జనసేన	32	6.36
కాంగ్రెస్	3	0.59
బీజేపీ	8	1.59

4. ఉత్తర నియోజకవర్గం
పోస్టల్ బ్యాలెట్‌లు: 776

టీడీపీ	192	24.74
వైసీపీ	445	57.34
జనసేన	54	6.95
కాంగ్రెస్	3	0.38
బీజేపీ	70	9.08

5. విశాఖ పశ్చిమ
పోస్టల్ బ్యాలెట్‌లు: 706

టీడీపీ	309	43.76
వైసీపీ	331	46.88
సీపీఐ	31	4.39
కాంగ్రెస్	4	0.56
బీజేపీ	23	3.25

6. గాజువాక
పోస్టల్ బ్యాలెట్‌లు 1,030

టీడీపీ	189	18.34
వైసీపీ	523	50.77
జనసేన	256	24.85
కాంగ్రెస్	9	0.87
బీజేపీ	52	5.04

7. పెందుర్తి : 877

టీడీపీ	204	23.26
వైసీపీ	588	67.04
జనసేన	61	6.95
కాంగ్రెస్	5	0.57
బీజేపీ	18	2.05

మామిడిపై రసాయనాలు

కృత్రిమంగా మగ్గబెట్టేందుకు ఇథలిన్, కాల్షియం కార్బైడ్ వినియోగం





- 24 గంటల్లో రంగు మార్పు
- అటువంటి పండ్లను తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం
- స్వల్ప కాలంలో తలనొప్పి, మానసిక గందరగోళం, జ్ఞాపక శక్తి నశించడం, మానసిక స్థితి నిలకడగా లేకపోవడం, నిద్రలేమి వంటి సమస్యలు
- దీర్ఘకాలంలో కేన్సర్, మూర్ఛ బారినపడే ప్రమాదం
- 20 నుంచి ప్రత్యేక డ్రైవ్‌కు ఆహార, భద్రతా ప్రమాణాల శాఖ అధికారులు సన్నద్ధం
- ఇథలిన్ 100 పీపీఎం దాటినట్టు తేలితే కేసు నమోదు.. జరిమానా, జైలు శిక్ష

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వేసవి వచ్చిందంటే ప్రతి ఒక్కరూ తీసుకునే పండ్ల జాబితాలో మామిడి తప్పక ఉంటుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం దిగుబడి తక్కువగా ఉండడంతో మార్కెట్‌లో పండ్ల లభ్యత తక్కువగా ఉంది. డిమాండ్ అధికంగా ఉండడంతో వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి వాటిని కృత్రిమ పద్ధతిలో మగ్గబెట్టి విక్రయాలు సాగిస్తున్నారు. అయితే, కృత్రిమంగా రసాయనాలు పిచికారీ చేయడం ద్వారా మగ్గబెట్టిన పండ్లు ఆరోగ్యానికి హానికరమని వైద్యులు చెబుతున్నారు.

ఇథలిన్ వినియోగం ద్వారా పక్వానికి...

సాధారణంగా మామిడి కాయ పండడానికి చాలా రోజులు సమయం పడుతుంది. ఈ క్రమంలో కొన్ని కుళ్లిపోవడం జరుగుతుంది. ఆ నష్టాన్ని తగ్గించుకునేందుకు వ్యాపారులు రసా యనాలు వినియోగిస్తున్నారు. ఇథలిన్‌ను వినియో గించడం ద్వారా 24 గంటల నుంచి 48 గంటల్లో కాయ రంగు మారిపోతుంది. ఇథోపాన్ నుంచి ఇథలిన్ గ్యాస్ వస్తుంది. ఈ గ్యాస్ ద్వారా కాయలు పండ్లుగా చేయవచ్చు. కానీ, వ్యాపారులు ఇథోపాన్‌ను లిక్విడ్ రూపంలో తీసుకువచ్చి నేరుగా పండ్లపై స్ప్రే చేస్తున్నారు. ఇది అత్యంత ప్రమాద కరమని అధికారులు చెబుతున్నారు. పండ్లపై ఇథలిన్ 100 పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్)కు మించి ఉండకూడదు. కానీ, నేరుగా స్ప్రే చేయడం వల్ల పీపీఎం పరిధికి మించి ఉంటోంది. దీనివల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. ఇథలిన్‌తోపాటు కాల్షియం కార్బైడ్‌ను వ్యాపారులు వినియోగిస్తుంటారు. గతంలో దీని వినియోగం చాలా ఎక్కువగా ఉండేది. ఇప్పుడు కాస్త తగ్గినప్పటికీ కొన్నిచోట్ల వ్యాపారులు వినియోగిస్తున్నట్టు చెబుతున్నారు. మామిడి కాయలను చెట్ల నుంచి దించిన తరువాత వాటిని లారీలో వేసుకుని తీసుకువచ్చే సమ యంలో పండ్లుగా మారుస్తున్నారు. కాయల మధ్యలో కాల్షియం కార్బైడ్‌ను పొట్లాల రూపంలో పెట్టించి మగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. కార్బైడ్ ... మిగతా 6వ పేజీలో

టీఎస్ ఎంసెట్‌లో

సత్తాచాటిన విశాఖ విద్యార్థులు

- ఇంజనీరింగ్‌లో ఫస్ట్ ర్యాంకు
- 200లోపు ఎనిమిది...
- అగ్రికల్చర్, ఫార్మసీలో 200లోపు ఏడు ర్యాంకులు



ఎస్.జ్యోతిరాదిత్య (ప్రథమ ర్యాంకు)



ధనుకొండ శ్రీనిధి (10వ ర్యాంకు)



రెడ్డి అనిల్ (47వ ర్యాంకు)



ఎం.సాయి వివలోచన్ (72వ ర్యాంకు)

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి):
తెలంగాణ ఎంసెట్-2024లో విశాఖ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. నగరంలోని శ్రీచైతన్య విద్యా సంస్థలో చదువుకున్న పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు చెందిన ఎస్.జ్యోతిరాదిత్య ఇంజనీరింగ్ విభాగంలో ప్రథమ ర్యాంకు సాధించాడు. జ్యోతిరాదిత్యకు 160కి 155.63 మార్కులు వచ్చాయి. శ్రీచైతన్య విద్యార్థులు పలువురు అటు ఇంజనీరింగ్, ఇటు అగ్రికల్చరల్/ఫార్మసీ విభాగాల్లో 200 లోపు ర్యాంకులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో ధనుకొండ శ్రీనిధి (10వ ర్యాంకు), రెడ్డి అనిల్ (47వ ర్యాంకు),

... మిగతా 6వ పేజీలో

స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన



ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లను శనివారం పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా. చిత్రంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున ఉన్నారు. - వివరాలు మెయిన్ 11లో

ఎన్నికల నిర్వహణకు రూ.12 కోట్లు విడుదల

- మొత్తం రూ.21 కోట్లు కేటాయింపు
- వాహనాలకు రూ.3 కోట్లు
- సిబ్బందికి రోజుకు రూ.250 చొప్పున చెల్లింపు

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి):
సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతగా రూ.12 కోట్లు విడుదల చేసింది. జిల్లాలో ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు ఈనెల 13వ తేదీన పోలింగ్ జరిగింది. వచ్చే నెల నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి అనేక కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. సిబ్బంది నియామకం, వారికి శిక్షణ, కేంద్రాలకు అవసరమైన మెటీరియల్ సమకూర్చడం, పోలింగ్ నిర్వహణ, ఈవీఎంలు స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలింపు, తరువాత భద్రపరచడం వరకూ ప్రతి దశలో నిధులు అవసరం. ఇందుకోసం జిల్లాకు రూ.21 కోట్లు కేటాయించారు. అందులో తొలివిడతగా రూ.12 కోట్లు విడుదల చేసింది. ఈ నిధుల నుంచి అసెంబ్లీ నియోజకవర్గాలకు అవసరమైన బడ్జెట్‌లో 60 శాతం మేర జిల్లా కలెక్టర్ కేటాయించారు. ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 620 వాహనాలు, 350 బస్సులు వినియోగించారు. వాహనాలకు రూ.మూడు కోట్లు అవసరమని అంచనా వేశారు. అలాగే పోలింగ్ నిర్వహణకు 15,500 మంది ఉద్యోగుల సేవలు వినియోగించుకున్నారు. వారికి రెండు విడతలలో రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. 12వ తేదీన మెటీరియల్ తీసుకువెళ్లడం, 13న పోలింగ్ నిర్వహణ, తిరిగి ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌లకు తరలింపు కోసం 14వ తేదీన కూడా ఉద్యోగులు సేవలందించారు. ప్రతి ఉద్యోగికి రోజుకు రూ.250 వంతున మొత్తం రూ.1.5 కోట్లు కేటాయించారు. పోలింగ్ ముందు మెటీరియల్ ... మిగతా 6వ పేజీలో

విదేశీ ఉద్యోగాల పేరిట మోసం

- కాంబోడియా తరలించి చైనా ముఠాలకు విక్రయం
- అక్కడ సైబర్ నేరాలపై శిక్షణ...
- భారతీయులకు ఫోన్‌లు చేయించి రూ.కోట్లు దోపిడీ
- చెప్పిన పని చేయకుంటే...చీకటి గదుల్లో బంధించి చిత్రహింసలు



వివరాలు వెల్లడిస్తున్న నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్

- గత ఏడాదిన్నరలో ఐదు వేల మంది వరకూ అక్రమ రవాణా
- అక్కడ నుంచి తప్పించుకున్న నగర యువకుడు
- పోలీసులకు ఫిర్యాదు
- ముఠాకు చెందిన ముగ్గురు అరెస్టు
- సీపీ రవిశంకర్ అయ్యన్నార్

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి):
'ఒక మాదిరిగా చదువుకున్నా పర్వాలేదు. విదేశాల్లో పెద్ద ఉద్యోగం. రూ.లక్షల్లో సంపాదన. ఏసీ రూముల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేయాల్సి ఉంటుంది' అని చెప్పి నిరుద్యోగ యువతను నమ్మించి విదేశీ ముఠాలకు విక్రయిస్తున్న ముగ్గురు సభ్యులను నగర పోలీసులు అరెస్టు చేశారు. ఆ ముఠా చేతిలో చిక్కిన ఓ యువకుడు ఇటీవల బయటపడ్డాడు. అతను ఇచ్చిన సమాచారంతో నిందితులను నగర పోలీసులు అరెస్టు చేయగలిగారు. ఇందుకు సంబంధించి శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్‌అయ్యన్నార్ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.

విశాఖలోని గాజువాక ప్రాంతానికి చెందిన చుక్కా రాజేష్ (33) ఇంజనీరింగ్ చదువుకున్నాడు. 2013 నుంచి 2019 వరకూ గల్ఫ్‌లో ఫైర్ సేఫ్టీ మేనేజర్‌గా పనిచేశాడు. తర్వాత గాజువాకలోనే ఒక కన్సల్టెన్సీని ప్రారంభించి గల్ఫ్ దేశాలకు ఫైర్ సేఫ్టీలో పనిచేసేందుకు మనుషులను పంపించడం మొదలెట్టాడు. 2023 మార్చిలో సంతోష్ అనే వ్యక్తి రాజేష్‌కు ఫోన్ చేసి తాను కాంబోడియా నుంచి మాట్లాడుతున్నానని, తనకు ... మిగతా 6వ పేజీలో

రిజర్వాయర్‌లో డెడ్ స్టోరేజీ

- కనీస నీటి మట్టానికి చేరువలో నిల్వలు

మేహాద్రిపై మహా నిర్లక్ష్యం

- 44.6 అడుగులకు పడిపోయిన వైనం
- పూడికతీత పనులు చేపట్టకపోవడమే కారణం
- ఏటా తగ్గిపోతున్న నీటి నిల్వ సామర్థ్యం
- ఏడాదిగా మరమ్మతులకు నోచుకోని స్పిల్‌వే గేట్లు
- నిర్వహణ పనులకు నిధులు విడుదల చేయని జీవీఎంసీ



మేహాద్రిగెడ్డ రిజర్వాయర్

గోపాలపట్నం, మే 18:
నగర ప్రజల దాహార్తిని తీర్చడంతో కీలకమైన మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ పరిస్థితి నానాటికీ దీనావస్థకు చేరుతోంది. నిర్వహణకు నిధులు మంజూరు చేయడంలో 'మహా' నిర్లక్ష్యం నగర వాసులకు శాపంలా పరిణమిస్తోంది. దీంతో రిజర్వాయర్ కొన్నేళ్లుగా వేసవి వచ్చేసరికి అడుగంటిపోతోంది. రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి అర్ధ శతాబ్దం గడుస్తున్నా మరమ్మతులపై దృష్టి సారించకపోవడం, ఏళ్లుగా పూడికతీత పనులు చేపట్టకపోవడంతో నీటి నిల్వల పరిస్థితి నానాటికీ దిగజారుతోంది.

వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలే లక్ష్యంగా నిర్మించిన మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ కాలక్రమేణా నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడంలో కీలకంగా మారింది. ఈ రిజర్వాయర్ నుంచి నగర వాసుల అవసరాల కోసం నిత్యం సుమారు 12 ఎంజీడీల నీటిని వినియోగిస్తుంటారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 61 అడుగులు కాగా, కనిష్ఠ నీటి మట్టం 44 అడుగులు. ప్రస్తుతం రిజర్వాయర్ నీటిమట్టం 44.6 అడుగులకు చేరింది. పూడిక తొలగింపు పనులు చేపట్టకపోవడంతో వర్షాలు కురిసే సమయంలో రిజర్వాయర్ తొందరగా నిండిపోతోంది. ఈ సమయంలో గేట్లు తెరిస్తే లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో రిజర్వాయర్ నీటిమట్టం 57 అడుగులకు చేరగానే గేట్లు తెరిచి, వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ కారణంగా కొన్నేళ్ల నుంచి ... మిగతా 6వ పేజీలో

వైభవంగా కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవం

» 108 స్వర్ణ పుష్పాలతో అభిషేకం

మహారాణిపేట, మే 18: వన్‌టౌన్‌లో 147 సంవత్సరాల చరిత్ర కలిగిన వాసవీ మాత కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా అమ్మవారి జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ అనంతరం క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి రజిత వస్త్రాలంకరణలో 108 స్వర్ణ పుష్పాలతో అభిషేకం గావించారు. 102 మంది మహిళలతో ప్రత్యేక కుంకుమ పూజలు, వాసవి మూల మంత్ర హోమం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం 108 రకాల స్వీట్లు అమ్మవారికి నివేదించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు ఆరిశెట్టి దినకర్, గ్రంధి రామకృష్ణారావు, సుగ్గు శివకుమార్ శ్రీవాసవి, ఆర్యవైశ్య యువజన సంఘాల ప్రతినిధులు, ఉత్సవ కమిటీలు సభ్యులు పాల్గొన్నారు.



కుంకుమార్చనలో మహిళలు



అమ్మవారికి 108 రకాల స్వీట్లతో నైవేద్యం

ఉచిత కంప్యూటర్, టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

కంచరపాలెం, మే 18: స్థానిక అశోక్‌నగర్‌లోని ఆంధ్ర బౌద్ధాలయంలో పేద విద్యార్థులు, యువత, గృహిణిలకు ఉచిత టైలరింగ్, కంప్యూటర్ శిక్షణను అందించనున్నట్టు బౌద్ధసంఘం ప్రధాన కార్యదర్శి కె. రాజు గణేష్ పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను బౌద్ధాలయంలో ఉదయం 10గంటల నుంచి సాయంకాలం 5గంటల మధ్య అందజేయాలని సూచించారు. దరఖాస్తులకు ఈనెల 25వరకు గడువు ఉందన్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి శిక్షణ తరగతులను ప్రారంభించనున్నామన్నారు.వివరాలకు ఫోన్: 96760 30455ను సంప్రదించాలి.



రథంపై ఉత్సవ విగ్రహం ఊరేగింపు



అమ్మవారి ప్రతిమలతో ఆలయానికి వస్తున్న భక్తులు

ఘనంగా ఎర్నిమాంబ తొలేళ్ల ఉత్సవం

» అమ్మవారి ప్రతిమలతో ఊరేగింపు

» నేడు ప్రధాన పండగ

జ్ఞానాపురం, మే 18: అల్లిపురం అచ్చియ్యమ్మపేట గ్రామస్తుల ఇలవేల్పు సంతాన దేవతగా పేరొందిన ఎర్నిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలేళ్ల ఉత్సవం పురస్కరించుకుని రాత్రి వందకు పైగా అమ్మవారి ప్రతిమలను పూర్ణామార్కెట్ దుర్గాలమ్మగుడి నుంచి కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట మీదుగా ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గుర్రపు రథంపై ఊరేగించారు. ముందుగా ఆలయ ఈవో సురేష్ బాబా, ఆలయ కమిటీ సభ్యులు అచ్చియ్యమ్మ పేట వద్ద నున్న పుట్టబంగారం చెట్టు నుంచి పుట్టమన్ను తీసి అమ్మవారికి సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా అనేక మంది అమ్మవారి మాలధారణ వేసిన భక్తులు ఆలయ వద్ద ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో అమ్మవారి ప్రతిమలు పట్టుకుని నడిచారు. కాన్వెంట్ కూడలి నుంచి జ్ఞానాపురం వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలతో ఆ ప్రాంతం కళకళలాడుతోంది. ప్రధాన పండగ ఆదివారం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

24 నుంచి ఇంటర్ సప్లమెంటరీ

మద్దిలపాలెం, మే 18 : జిల్లా వ్యాప్తంగా ఈనెల 24 నుంచి వచ్చే నెల 1 వరకు ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 నుంచి 12 వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 49 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా అన్ని గదుల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం నుంచి 31,768 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 8,229 మంది పరీక్షలు రాయనున్నారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ మురళీధర్ విలేకరులతో మాట్లాడుతూ సప్లమెంటరీ పరీక్షలకు అన్ని కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పరీక్ష కేంద్రాలకు సెల్‌ఫోన్లు అనుమతించమని, ప్రిన్సిపాల్, ఇన్విజిలేటర్, సిబ్బంది వద్ద ఫోన్లు ఉంటే క్రిమినల్‌చర్యలుతీసుకుంటామనిహెచ్చరించారు. విద్యార్థులకు ఏసమస్య ఉన్నా 0891-2552854, 0891-2567561 ఫోన్ నంబర్‌లో సంప్రతించాలని సూచించారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి



ఎన్‌సీసీ కేడెట్స్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

డాబాగార్డెన్స్, మే 18: చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మంజుల విద్యార్థులకు సూచించారు. ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ షూటింగ్ షిప్- 2023 పాల్గొన్న కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్స్ సీహెచ్ శాంతిపణి, ఎస్.కిరణ్మయి శనివారం ఆమె అభినందించారు. ఈ క్యాంపు ఈ నెల 3 నుంచి 14 తేదీ వరకు పెద్దాపురం జేఎన్‌వీలో జరిగిన ఈ క్యాంప్‌లో విద్యార్థినులు పాల్గొని మెలకువలు నేర్చుకున్నారన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్స్ కె.గీతాంజలి, ఆర్.కిరణ్మయి పాల్గొన్నారు.

23న అన్‌క్లయిమ్డ్ పార్శిళ్ల వేలం

ద్వారకాబస్‌స్టేషన్, మే 18: ప్రజా రవాణా శాఖ (పీటీడీ) విశాఖ రీజియన్ లాజిస్టిక్ విభాగంలో ఉన్న అన్‌క్లైమ్డ్ పార్శిళ్లను ఈ నెల 23న వేలం వేసేందుకు యాజమాన్యం నిర్ణయించింది. వివిధ ప్రాంతాల నుంచి రీజియన్ లాజిస్టిక్స్ కార్యాలయానికి వచ్చిన పలు పార్శిళ్లను ఎవరూ తీసుకో లేదు. గత ఆరు నెలలుగా కొన్ని పార్శిళ్లు గొడౌన్‌లోనే మగ్గు తున్నాయి. వీటిని 23వ తేదీ ఉదయం 11కు ద్వారకా బస్ స్టేషన్‌లో వేలం నిర్వ హిం చనున్నట్టు రీజనల్ మేనేజర్ అంధవరపు అప్పలరాజు తెలిపారు. ఆసక్తి గలవారు ఈ వేలంలో పాల్గొనాలని కోరారు.

చాలా రోజుల తర్వాత నిష్పక్షపాతంగా పోలీసులు

» అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్



ఆలయం ఎదుట మాట్లాడుతున్న సీఎం రమేష్

తిరుమల, మే 18(ఆంధ్రజ్యోతి): చాలా రోజుల తర్వాత ఏపీలో పోలీసులు కొంతమేర నిష్పక్షపాతంగా పనిచేస్తున్నారని అనకాపల్లి పార్లమెంట్ కూటమి అభ్యర్థి సీఎం రమేష్ అన్నారు. తిరుమల శ్రీవారిని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో పోలీసు యంత్రాంగం యావత్తూ వన్‌సైడ్‌గా పనిచేసిందన్నారు. ఇప్పుడు ఈసీ పుణ్యమా అని పోలీసులు 10 శాతం నిష్పక్షపాతంగా పనిచేస్తుంటేనే వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. కొంతమంది అధికారులు ఇంకా పాత వాసనలోనే ఉన్నారన్నారు. రావణ, రాక్షసరాజ్యం పోయి రామరాజ్యం వచ్చేలా ఆశీర్వదించినందుకు శ్రీవారికి మొక్కు చెల్లించి ధన్యవాదాలు తెలిపేందుకు తిరుమలకు వచ్చానన్నారు. రానున్నరోజుల్లో ఏపీలో ప్రశాంతమైన పాలన నడుస్తుందన్నారు.

ఆచార్య జర్రా అప్పారావుకు చందు సాహిత్య పురస్కారం



పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు

సీతంపేట, మే 18: ఆచార్య చందు సుబ్బారావు లిటరేచరీ, కల్చరల్ ట్రస్ట్ సాహిత్య సేవా పురస్కారం- 2024ను ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జర్ర అప్పారావుకు ప్రదానం చేశారు. శనివారం పౌరగ్రంథాలయంలో ట్రస్ట్ చైర్మన్ కె.ఎస్.చలం అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అప్పారావుకు అవార్డుతో పాటు రూ.10 వేల నగదు, మెమెంటోతో అతిథులు సత్కరించారు. ఆది కవినన్నయ్య విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు, ఆచార్య చందు సుబ్బారావు ఎమ్మెల్సీ ఆచార్య కుంభ రవిబాబు, వి. శిమ్మన్న, డా.డి.ఆర్.కె.రావు, మేడ మస్తాన్‌రెడ్డి, డీవీ సూర్యారావు పాల్గొన్నారు.

చిరంజీవితో గంటా భేటీ..



చిరంజీవికి పుష్పగుచ్ఛమిస్తున్న గంటా శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్, మే 18: మాజీమంత్రి , భీమిలి అసెంబ్లీ కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు శనివారం మెగాస్టార్ చిరంజీవిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చిరంజీవి ఇటీవల పద్మవిభూషణ్ అవార్డు అందుకున్న సందర్భంగా అభినందనలు తెలుపుతూ సన్మానించారు. అనంతరం రాజకీయాలు, సినిమాలు తదితర అంశాలపై చర్చించారు. పోలింగ్ సరళి, ఎన్నికల్లో జనసేనాని పవన్‌కల్యాణ్ ప్రభావం, రాష్ట్ర రాజకీయాలకు సంబంధించిన కీలక అంశాలపై చిరంజీవి ఆరాతీశారు. కొత్తగా నటిస్తున్న సినిమాలపై చిరంజీవి కొంతసేపు ముచ్చటించారు. భీమిలి నుంచి గంటా భారీ మెజార్టీతో గెలవాలని, అంతా మంచిజరిగి రాబోయే కాలంలో ఆంధ్ర అభివృద్ధి పథంలో దూసుకువెళ్లాలని ఈ సందర్భంగా చిరంజీవి ఆకాంక్షించినట్టు గంటా తెలిపారు.

నార్త్‌లో ప్రశాంతంగానే ఎన్నికలు

» వైసీపీ అభ్యర్థి కేకే రాజు



సీతంపేట, మే 18: విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, అధికారులు తగు చర్యలు తీసుకున్నారన్నారు. ఎన్నికల అనంతరం ఈ నియోజకవర్గం పరిధిలో కుటుంబ కలహాలతో జరిగిన ఓ గొడవను వైసీపీపై రుద్దేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నం చేస్తున్నట్టు ఆయన ఆరోపించారు. దీనిపై పోలీసు అధికారులు కూడా విచారణ జరిపి రాజకీయాలకు ఈ గొడవకు ఎటువంటి సంబంధం లేదని ప్రకటించారని చెప్పారు. ప్రజలు ఈ పరిణామాలన్నీ గమనిస్తున్నారని, దీనిపై త్వరలోనే తగిన రీతిలో ఫలితాలనిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

కీలకంగా పోస్టల్ ఓట్లు

... 5వ పేజీ తరువాయి

ఫలితాలను తారుమారు చేసే అవకాశం లేకపోలేదంటున్నారు.

ఎన్నికల్లో ప్రతి ఓటు ఎంతో కీలకం. కొన్నిసార్లు ఒక్క ఓటే ఫలితాన్ని తారుమారు చేస్తోంది. 1989లో కొణతాల రామకృష్ణ అనకాపల్లి నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి సమీప ప్రత్యర్థి పెతకంశెట్టి అప్పలనరసింహంపై కేవలం తొమ్మిది ఓట్ల తేడాతో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో టీడీపీ కేవలం 26 ఓట్ల తేడాతో విజయవాడ సెంట్రల్ సీటును కోల్పోయింది.

టీఎస్ ఎంసెట్‌లో సత్తాచాటిన విశాఖ విద్యార్థులు

... 5వ పేజీ తరువాయి

ఎం.సాయి వివ లోచన్ (72వ ర్యాంకు), ఎం.మణికంఠ పృథ్వీరాజ్ (90), భేరి సాహితి (125), ఆళ్ల రామలింగం నాయుడు (129), తోట ధీరజ్వేర్ (184), కట్టమూరి కుశాల్ (190వ ర్యాంకు) సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో శరగడం పావని 32వ ర్యాంకు, మేకా గాయత్రి 44వ ర్యాంకు, శంబంగి మనో అభిరామ్ 73, జె.సాకేత్‌సాయి 113, సీహెచ్ వేదాంత సంతోష్ 123, టి.సాయి నిఖిలేష్ 149, బి.జయదీప్ 169వ ర్యాంకు సాధించారు. తెలంగాణ ఎంసెట్‌లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను శ్రీచైతన్య ఏజీఎం కేవీ రమణ అభినందించారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్/ఫార్మసీ విభాగాల్లో 10లోపు ఒకరు, 100లోపు ఏడుగురు, 500లోపు 59 మంది ర్యాంకులు సాధించారన్నారు. ఇందుకు కృషిచేసిన కళాశాలల ప్రిన్సిపాళ్లు, డీన్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిని ఆయన అభినందించారు.

మామిడిపై రసాయనాలు

... 5వ పేజీ తరువాయి

ఆర్సినిక్, పాస్పరస్‌లు ఆక్సిజన్‌తో కెమికల్ రియక్షన్ జరిగి ఎసిటిలిన్ అనే గ్యాస్ విడుదలవుతుంది. ఎసిటిలిన్ గ్యాస్ వల్ల మామిడికాయ త్వరగా రంగు మారడంతోపాటు మెత్తపడుతుంది. ఈ ఎసిటిలిన్ అనే గ్యాస్‌ను సాధారణంగా వెల్డింగ్‌కు వినియోగిస్తుంటారు. దీనిని పండ్లను మగ్గబెట్టేందుకు వినియోగిస్తున్నారు. అలా పండించిన పండ్లను తీసుకుంటే ప్రమాదకరమైన కేన్సర్లు బారినపడే అవకాశముంది.

తీవ్రమైన ఆరోగ్య సమస్యలు

రసాయనాలు కలిపిన పండ్లను తీసుకోవడం వల్ల తీవ్ర మైన అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశ ముందని వైద్యులు చెబుతున్నారు. ఈ పండ్లను తీసుకున్న వెంటనే జీర్ణ సంబంధ సమస్యలు కనిపిస్తే, దీర్ఘకాలంలో ప్రమాదకర వ్యాధులకు కారణమయ్యే అవకాశముందని చెబుతున్నారు. కృత్రిమంగా ఎసిటిలిన్ గ్యాస్ వినియోగించి మగ్గబెట్టిన పండ్లను తీసుకుంటే కేన్సర్ బారినపడే అవకాశముంది. రసాయనాలు కలిగిన పండ్లను తినడం వల్ల తలనొప్పి, మైకం, మానసిక గందరగోళం, జ్ఞాపకశక్తి నశించడం, మానసిక స్థితి నిలకడగా లేకపోవడం, నిద్రలేమి, సెరిబ్రల్ ఎడిమా వంటి సమస్యలు ఇబ్బందులకు గురిచేస్తాయని చెబుతున్నారు. వీటితోపాటు మూర్ఛ బారినపడి దీర్ఘకాలంలో హైపోక్సియాను ప్రేరేపిస్తూ శరీర వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపించే అవకాశం ఉంది.

ఇలా గుర్తించాలి

రంగు, రుచి, గుజ్జు, రసం ద్వారా రసాయనాలు కలిపిన పండ్లను గుర్తించవచ్చు. రసాయనాలు చల్లిన పండ్లు సాధారణంగా ముగ్గిన వాటి మాదిరిగా కాకుండా అసహజ ముదురు రంగును కలిగి ఉంటాయి. రుచి తేడాగా ఉంటుంది. చప్పగా ఉంటుంది. కాల్షియం కార్బైడ్ కలిపిన పండ్లను తీసుకున్న ప్పుడు నోటిలో మంటగా ఉంటుంది. వీటిని తిన్న తరువాత కడుపునొప్పి, డయేరియా, గొంతులో మంట ఉంటాయి. సహజంగా పండిన ఫలాలతో పోలిస్తే రసాయనాలు కలిపిన పండ్లలో తగినంత రసం ఉండదు.

స్పెషల్ డ్రైవ్

ఈ నెల 20 నుంచి మామిడి పండ్ల విక్రయాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహణకు ఆహార, భద్రతా ప్రమాణాల శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే తనిఖీలు నిర్వహిస్తున్నారు. పది వరకు నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం పంపించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నమూనాలు సేకరించి తనిఖీలు నిర్వహించనున్నట్లు ఆహార భద్రత, ప్రమాణాల శాఖ జిల్లా అధికారి నందాజీ తెలిపారు. 100 పీపీఎం కంటే ఎక్కువ ఉన్నట్టు తేలితే వ్యాపారులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇథలిన్ 100 పీపీఎం దాటితే జరిమానాతోపాటు రెండేళ్లపాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. కాల్షియం కార్బైడ్ వినియోగించినట్టు తేలితే ఆరు నెలలు జైలుతోపాటు రెండు లక్షల రూపాయల వరకు జరిమానా ఉంటుందన్నారు.



'మేహాద్రి'పై మహా నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గించాల్సి వస్తోంది. ఇదిలావుండగా రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి 50 ఏళ్లు కావస్తున్నా ఇప్పటివరకు ఒక్కసారి కూడా పూడికతీత పనులు చేపట్టలేదు. ఇందుకోసం పదేళ్ల కిందట డ్రెడ్జింగ్ కార్పొరేషన్ అధికారులతో పరిశీలన జరిపించగా సుమారు రూ.50 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే నిధులు ఇచ్చేందుకు జీవీఎంసీ ససేమిరా అనడంతో ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. దీంతో ఏటా రిజర్వాయర్ నీటిమట్టం తగ్గుముఖం పడుతూనే ఉంది.

నిర్వహణలో మహా నిర్లక్ష్యం

వాస్తవానికి మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నిర్వహణ బాధ్యతలు ఇరిగేషన్ శాఖ చూస్తున్నప్పటికీ, అందుకు అవసరమైన నిధులను సమకూర్చే బాధ్యత పూర్తిగా జీవీఎంసీ తీసుకుంది. కానీ కనీస నిర్వహణ కోసం నిధులు మంజూరు చేయకపోవడంతో రిజర్వాయర్ పరిస్థితి అధ్వానంగా మారుతోంది. పూడికతీత పనులు, గట్లు నిర్వహణ, రాతిపేర్పు వంటి పెద్ద పనుల మాటెలా ఉన్నా కనీసం స్పిల్‌వే వద్ద రెండు గేట్లు మరమ్మతుకు గురై నెలలు గడుస్తున్నా జీవీఎంసీ నిధులు మంజూరు చేయకపోవడంతో నీరు వృథాగా పోతోంది. నగరవాసుల తాగునీటి అవసరాలను గుర్తించి, సకాలంలో నిర్వహణ పనులకు నిధులు విడుదల చేయాల్సిన జీవీఎంసీ అధికారులు, పాలకులు తమకు పట్టనట్టు వ్యవహరిస్తుండడమే దీనికి కారణమని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. సకాలంలో గేట్లు మరమ్మతులు చేపట్టకపోతే వర్షాలు కురిసే సమయంలో వరద నీటిని వెంటనే దిగువకు విడుదల చేయాల్సి వస్తోందని, లేదంటే రిజర్వాయర్‌కు ముప్పువాటిల్లే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి రిజర్వాయర్ నిర్వహణ చర్యలు చేపట్టకపోతే నీటి నిల్వలు మరింత దిగజారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

కిర్గిస్థాన్‌లో అల్లర్లతో ఆందోళన

» వైద్యవిద్యను అభ్యసిస్తున్న పలువురు నగర విద్యార్థులు

» హాస్టళ్లపై దాడులతో తల్లిదండ్రుల్లో ఆందోళన

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి): కిర్గిస్థాన్‌లో అల్లర్లు జరుగుతున్న నేపథ్యంలో అక్కడ వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం నుంచి విదేశీ విద్యార్థులు చదువుకునే విద్యా సంస్థలు, హాస్టళ్లపై అక్కడ పౌరులు దాడులు చేస్తున్నారు. రాజధాని బిష్కెక్ (బీఎస్‌హెచ్‌కెఈకే)లో గల యూనివర్సిటీలో విశాఖ నగరానికి చెందిన పలువురు వైద్య విద్యనభ్యసిస్తున్నారు. అక్కడ అల్లర్లు జరుగుతున్నట్టు పలువురు విద్యార్థులు...తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. హాస్టళ్ల నుంచి బయటకు రావద్దని శనివారం ఉదయం సంబంధిత యాజమాన్యాలు హెచ్చరించడంతో విద్యార్థులు వణికిపోతున్నారు. కొన్ని మెస్‌లలో ఒక్క పూటే అందించినట్టు నాలుగో సంవత్సరం విద్యార్థిని విశాఖలోని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. దాడులు పెరగవచ్చునన్న వదంతులు వ్యాపించడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కిర్గిస్థాన్‌లోని భారతీయ రాయబార కార్యాలయం అనుమతి లేకుండా ఎవరూ బయటకు రావద్దని విదేశాంగ మంత్రిత్వశాఖ శనివారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో విద్యార్థులను కిర్గిస్థాన్ పంపించిన కన్సల్టెన్సీల ప్రతినిధులను పలువురు తల్లిదండ్రులు సంప్రతించగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

ఎన్నికల నిర్వహణకు రూ.12 కోట్లు విడుదల

... 5వ పేజీ తరువాయి

పంపిణీ సమయంలో ఏయూలో టెంట్లు, కుర్చీలు ఏర్పాటుచేశారు. సిబ్బందికి అల్పాహారం, భోజనం అందించారు. ఇంకా స్ట్రాంగ్‌రూమ్‌ల సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు కేటాయించారు. తొలివిడత ఇచ్చిన నిధులు ఖర్చు చేసిన తరువాత రెండో విడతలో మిగిలిన నిధులు విడుదల చేస్తారని భావిస్తున్నారు.

నూజివీడు వద్ద రోడ్డు ప్రమాదం: విశాఖ వాసులకు గాయాలు

నూజివీడు టౌన్, మే 18: పెట్రోల్ ట్యాంకర్ టైర్ పేలి ట్యాంకర్, ఆటో ఢీకొనడంతో ఐదుగురికి తీవ్ర గాయాలైన ఘటన ఏలూరు జిల్లా నూజివీడు మండలం మీర్జాపురం వద్ద చోటుచేసుకుంది. నూజివీడు నుంచి ఏలూరు వెళుతున్న పెట్రోల్ ట్యాంకర్ మీర్జాపురం వద్ద ముందు భాగంలోని ఎడమ టైర్ పేలి పోవడంతో ట్యాంకర్ అదుపుతప్పి హనుమాన్ జంక్షన్ నుంచి నూజివీడు వస్తున్న ఆటోను ఢీ కొంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న విశాఖ పట్నం గాంధీనగర్‌కు చెందిన కురందాస్ గోవింద్, కురందాస్ ఆదిలక్ష్మి, కురందాస్ రత్నం, అరసా ప్రసాద్‌తో పాటు తణుకు మండలం పైడిపర్రుకు చెందిన దూళ్ల నాగపెద్దిరాజు తీవ్రంగా గాయ పడ్డారు. దీంతో 108 సిబ్బంది క్షతగాత్రులను నూజివీడుఏరియా ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు.

సీపీ అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదు: విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, మే 18: కప్పరాడ బర్మాక్యాంప్‌లో వైసీపీ మూకల దాడిలో గాయపడిన బాధితులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్‌ను కలిసేందుకు ప్రయత్నిస్తుంటే ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదని ఉత్తర నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పెనుమత్స విష్ణుకుమార్‌రాజు తెలిపారు. గత మూడు రోజులుగా సీపీని పలుమార్లు కోరినా అపాయింట్‌మెంట్ ఇచ్చేందుకు నిరాకరిస్తున్నట్టు విష్ణుకుమార్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సెలవు కావడంతో కనీసం సోమవారం అయినా అపాయింట్‌మెంట్ దొరుకుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలు జరిగిపోయినా అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంశోచనీయమనిఆయన విచారం వ్యక్తం చేశారు.

మద్యం మత్తులో ట్రాఫిక్ పోలీసులపై యువకుడు దాడి

మర్రిపాలెం, మే 18: ఎన్ఏడీ జంక్షన్‌ఫ్లైఓవర్ కింద మార్గంలో ట్రాఫిక్ పోలీసులపై యువకుడు దాడికి పాల్పడిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ట్రాఫిక్ పోలీసులు, లాఅండ్ ఆర్డర్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఎన్ఏడీ ఫ్లైఓవర్ కింద మార్గంలో రాత్రి ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై రావడంతో వారిని నిలిపి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేయడానికి సిద్ధమయ్యారు. ఇంతలో ఒకరు బైక్ దిగి పారిపోయాడు. మిగిలిన ఇద్దరు యువకుల్ని ఆపి వివరాలు సేకరించే ప్రయత్నం చేశారు. ఇంతలో ఇద్దరిలో చరణ్‌రాజ్ అనే యువకుడు పోలీసులపై దాడికి పాల్పడ్డాడు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలకు సహకరించలేదు. యువకుడిని నిలువరించేందుకు యత్నించిన హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ కాలర్ పట్టుకుని దుర్భాషలాడుతూ హల్‌చల్ చేశారు. దీంతో ఆయువకుడిని అదుపు లోకి తీసుకుని ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. వీరిపై విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడినందుకు, మద్యంసేవించి వాహనం నడిపినందుకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మరికొన్ని ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విశాఖపట్నం, మే 18: వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా నడుస్తున్న మరికొన్ని ప్రత్యేక రైళ్లను కొద్ది రోజులపాటు పొడిగిస్తున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. దీనిలో భాగంగా సంబల్‌పూర్-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను (08321) ఈనెల 30 నుంచి జూన్ 27 వరకు, ఎస్ఎంవీ బెంగళూరు-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను (083 22) జూన్ ఒకటి నుంచి 29 వరకు, సంబల్‌పూర్- కాచీగూడ ఎక్స్‌ప్రెస్ ను (08325) ఈనెల 27 నుంచి జూన్ 24 వరకు, కాచీగూడ-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను (08326) ఈనెల 28 నుంచి జూన్ 25 వరకు పొడిగించినట్టు ఆయన పేర్కొన్నారు.

మళ్లింపు మార్గంలో హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్

అంబాల డివిజన్‌లోని శంభుస్టేషన్ వద్ద కిసాన్ ఉద్యమం జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 21న విశాఖ నుంచి అమృతసర్ వెళ్లే హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (20807), తిరుగు ప్రయాణంలో ఈనెల 22న అమృతసర్ నుంచి విశాఖ వచ్చే హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (20808) రైళ్లు వయా ఉత్తర రైల్వేలోని జఖాల్, ధురి, లుధియానా మీదుగా మళ్లింపు మార్గంలో రాకపోకలు సాగిస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైళ్లు రానుపోను మార్గంలోని పానిపట్, అంబాల స్టేషన్లకు చేరవని పేర్కొన్నారు.

విదేశీ ఉద్యోగాల పేరిట మోసం

... 5వ పేజీ తరువాయి

డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేసేందుకు కంప్యూటర్ నాలెడ్జ్‌తోపాటు ఇంగ్లీష్ మాట్లాడగలిగే 30 మంది కావాలని కోరాడు. విమానం టికెట్లు, వీసా, కాంబోడియాలో వసతి సదుపాయం వంటివి తానే చూసుకుంటానని, ఒక్కొక్కరి నుంచి రూ.90 వేలు వసూలుచేసి అందులో రూ.20 వేలు కమీషన్ కింద తీసుకోవాలని ఆఫర్ ఇచ్చాడు. కాంబోడియా నుంచి జాబ్ స్కామ్‌లు, టాస్కగేమ్ వంటి సైబర్ ఫ్రాడ్స్ చేసే పని వారికి అప్పగిస్తామని రాజేష్‌కు చెప్పాడు. అయితే తక్కువ కాలంలోనే భారీగా సంపాదించే అవకాశం దొరికిందని భావించిన రాజేష్ విశాఖతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతను కాంబోడియాలో ఉద్యోగాలంటూ ఆకర్షించి తొలుత 27 మందిని మూడు దఫాలుగా అక్కడకు పంపించాడు. తర్వాత ఆర్య అనే మహిళ రాజేష్‌ను పరిచయం చేసుకుని సంతోష్ కంటే ఎక్కువ కమీషన్ ఇస్తామని చెప్పింది. ఆమెతోపాటు ఉమామహేష్, హబీబ్ అనే ఏజెంట్లు కూడా పరిచయం అయ్యారు. వీరందరి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా తనను సంప్రతించిన 150 మంది నిరుద్యోగులను రాజేష్ విజిటింగ్ వీసాపై బ్యాంకాక్...అక్కడ నుంచి కాంబోడియా పంపించాడు. అక్కడకు వెళ్లిన తర్వాత ఒక్కొక్కరిని చైనా కంపెనీలకు ఏజెంట్లు 2,500 డాలర్లు నుంచి నాలుగు వేల డాలర్లు చొప్పున విక్రయించారు. ఇలా గత రెండేళ్లలో ఏపీ, తెలంగాణాతోపాటు దేశవ్యాప్తంగా ఐదు వేల మంది పలువురు ఏజెంట్ల ద్వారా కాంబోడియా చేరినట్టు పోలీసులు అంచనా వేస్తున్నారు. వీరందరినీ చైనా ముఠాలు కొనుక్కొని వారికి సైబర్ నేరాలపై శిక్షణ ఇచ్చి భారతీయులకు ఫోన్లు చేయించి మోసాలకు పాల్పడేలా చేస్తున్నాయి. ఎవరైనా ఆ పని చేయబోమంటే చీకటి గదుల్లో పెట్టి చిత్రహింసలకు గురిచేసేవి. ఇలా ఈ ఏడాదిన్నరలో భారతీయుల నుంచి వందల కోట్లు దోచుకున్నాయి. కాగా, కాంబోడియాలో చైనా ముఠా చేతిలో చిక్కుకున్న నగరానికి చెందిన బొత్స శంకర్ అక్కడి నుంచి తప్పించుకుని నగరానికి చేరుకుని 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి సమాచారం అందజేశారు. దీనిపై సీపీ రవిశంకర్ అయ్యన్నార్ ఆదేశాల మేరకు సైబర్‌క్రైమ్ సీఐ కె.భవానీప్రసాద్ లోతుగా దర్యాప్తు చేసి ఉద్యోగాల పేరుతో మానవ అక్రమ రవాణాకు సహకరిస్తున్న గాజువాక ప్రాంతానికి చెందిన చుక్కా రాజేష్‌తోపాటు అతని వద్ద పనిచేస్తున్న సబ్బవరపు కొండలరావు, మన్నేన జ్ఞానేశ్వర్‌లను అరెస్టు చేశారు. కాంబోడియాలో చిక్కుకున్న వారిని విడిపించేందుకు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రిత్వశాఖతో సంప్రతింపులు జరుపుతామని సీపీ తెలిపారు. ఈ సమావేశంలో ఏడీసీపీ ఎం.శ్రీనివాసరావు, సైబర్‌క్రైమ్ సీఐ భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవులకు ఊరెళుతున్నారా.. తస్మాత్ జాగ్రత్త!



ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు

విహార యాత్రలు, పుణ్యక్షేత్రాలకు వెళ్లే వారంతా ఇళ్లల్లో బంగారు ఆభరణాలు, నగదు ఉంచవద్దు

క్యాంపు వెళుతున్నట్టు సమాచారం అందిస్తే ఆయా ఇళ్లపై ప్రత్యేక నిఘా పెడతామని స్పష్టీకరణ

ఉక్కుటౌన్‌షిప్, మే 18: పాఠశాలలు, కాలేజీలకు వేసవి సెలవులు ప్రకటించడంతో విహార యాత్రలు, పుణ్యక్షేత్రాలకు వెళ్లేవారితో రైళ్లు, బస్సులు రద్దీగా కనిపిస్తున్నాయి. చాలామందికి రైళ్లలో రిజర్వేషన్లు దొరక్కపోవడంతో అందుబాటులో ఉన్న ఆర్టీసీ, ప్రైవేటు బస్సులను ఆశ్రయిస్తూ ఆయా ప్రాంతాలకు బయలుదేరుతున్నారు. ఇదే అదనుగా ఇళ్లను గుల్ల చేసే దొంగల ముఠాలు చోరీలకు పాల్పడే పనిలో నిమగ్నమవ్వడం సాధారణంగా మారింది. పోలీసులు ఎంత నిఘా పెట్టినా, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ప్రజలు ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా దొంగలకు అడ్డుకట్ట వేయడం సాధ్యం కాదు. ఈ క్రమంలో వేసవిలో దొంగతనాల నివారణపై పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. వేసవి సెలవులకు విహార యాత్రలు, పుణ్యక్షేత్రాలకు వెళ్లేవారు ముందుగా పోలీసులకు సమచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. ఇలా సమాచారం అందజేస్తే ఆయా ఇళ్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని వారు పేర్కొంటున్నారు. ఎక్కడైనా, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే తక్షణమే తమకు తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో టౌన్‌షిప్‌లో వరసగా దొంగతనాలు జరగడంతో పోలీసులు గస్తీ నిర్వహిస్తూ బందోబస్తును పెంచడంతో చోరీల సంఖ్య చాలావరకు తగ్గింది. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో గస్తీ పెంచామని, ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు ఇళ్లల్లో విలువైన బంగారు ఆభరణాలను, పెద్ద మొత్తంలో నగదును ఉంచరాదని, తమకు తెలిసిన వారిని ఎవరినైనా ఇంట్లో ఉంచి వెళ్లాలని సూచిస్తున్నారు. దొంగతనాల నివారణలో భాగంగా స్టీల్‌ప్లాంట్ పోలీసులు ఆటోల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆటోల్లో మైక్ ద్వారా ప్రజలకు సూచనలు ఇవ్వడమే కాకుండా కరపత్రాలను పంపిణీ చేస్తూ స్థానికులను చైతన్యవంతుల్ని చేస్తున్నారు. దొంగతనాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు.

ఇబ్బందులు కలిగితే సమాచారం ఇవ్వండి



ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు కలిగితే తక్షణమే స్టీల్‌ప్లాంట్ పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వేసవి సెలవులకు కుటుంబ సమేతంగా విహార యాత్రలు, పుణ్యక్షేత్రాలకు వెళ్లేటప్పుడు ముందుగా తమకు సమాచారం అందిస్తే ఆయా ఇళ్లపై ప్రత్యేక నిఘా పెడతాం. ప్రజలకు సేవ చేసేందుకు తాము 24 గంటలూ అందుబాటులో ఉంటాం.

-వి.శ్రీనివాసరావు, స్టీల్‌ప్లాంట్ సీఐ



ప్రథమ బహుమతి సాధించిన లోకల్ బాయ్స్ జట్టు సభ్యులతో అతిథులు

ముగిసిన బోయమాంబ క్రికెట్ లీగ్ టోర్నీ

అగనంపూడి, మే 18: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఉక్కు నిర్వాసిత కాలనీ కొత్తూరు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోయమాంబ క్రికెట్ లీగ్ (బీకేపీఎల్) టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో లోకల్ బాయ్స్, నైట్ రైడర్స్, వీసీ బాయ్స్ జట్లు నిలిచాయి. విజేతలకు వరుసగా రూ లక్ష, రూ.50 వేలు, రూ.25 వేల నగదుతో పాటు జ్ఞాపికలను జనసేన, టీడీపీ నాయకులు దుల్ల రామునాయుడు, దాసరి త్రినాథరావు, కర్రి దేశేంద్ర అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత కోసం క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని, ఇలాంటి పోటీల వల్ల యువత మధ్య స్నేహ సంబంధాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎస్.లక్ష్మణరావు, టి.పూర్ణ శ్రీనివాసరావు, ఎస్.వెంకటకృష్ణ, డి.వెంకటేశ్, అరుణ్‌కుమార్, శేషు, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో ఈతకు దిగిన యువకుడి మృతి



పవన్ మృతదేహం

గోపాలపట్నం, మే 18: మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ స్పిల్‌వే దిగువన ఈతకు దిగిన ఓ యువకుడు నీటిలో మునిగి మృతి చెందాడు. పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని సీతంపేట, రెల్లివీధి ప్రాంతానికి చెందిన కొందరు యువకులు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో ఈత కోసం శనివారం మధ్యాహ్నం వచ్చారు. వీరంతా రిజర్వాయర్ స్పిల్‌వే దిగువ ప్రాంతంలో ఈతకు దిగగా, సుర పవన్ (20) అనే యువకుడు నీటిలో మునిగిపోయాడు. ఈ మేరకు రిజర్వాయర్ సిబ్బంది పెందుర్తి పోలీసులకు సమాచారం అందించడంతో వారు గజ ఈతగాళ్ల సాయంతో గల్లంతైన యువకుని గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో పవన్ మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

ఆరిలోవ, మే 18: గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులపై ఆరిలోవ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పాత డెయిరీ ఫారానికి సమీపంలోని ఇందిరానగర్‌లో పోలీసులను చూసి పారిపోతున్న ఇద్దరు యువకులను ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని సోదా చేయగా సుమారు అరకిలో గంజాయి లభించింది. వీరు అల్లిపురానికి చెందిన పాత నేరస్తులని సీఐ గోవిందరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

వేపగుంట, మే 18: నాయుడుతోట సమీపంలోని బంటాకాలనీలో విరాట్ శ్రీవిశ్వకర్మ సేవా సమితి, విశ్వబ్రాహ్మణ సంఘం సంయుక్తంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటానికి పూలమాల వేసి దీపారాధన చేసి పూజలు, హోమం జరిపారు. హోమం చేసిన వేదపండితులు లావేటి సంతోషిఆచార్యులు, కె.రవి ఆచార్యులను సంఘ సభ్యులు సత్కరించారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితిలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలను నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారికి పంచామృతాభిషేకాలు చేసి ప్రత్యేక వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో కణితి గ్రామ దేవతల కమిటీ ప్రతినిధులు ఎస్ఎస్ విజయరామరాజు, పి.వేణుబాబు, దానప్పలు, దామోదర్, గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: నెల్లిముక్కు రామాలయ ప్రాంగణంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలను కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి ప్రారంభించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ ధర్మకర్త ఎం.శ్రీరామమూర్తి, కమిటీ సభ్యుడు కణితి అప్పలరాజు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిపారు.

వైభవంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు

కూర్మన్నపాలెం, మే 18: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడిలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాన్ని శనివారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు, హోమాలు జరిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కారుమూరి మహేశ్, సుజాత, వెంకటరమణ, మధుసూదనశెట్టి, లింగేశ్వరరరావుతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీ క్యాడెట్ కార్పస్ క్యాంపు ప్రారంభం

విశాఖపట్నం, మే 18: విశాఖ నౌసేనాబాగ్ కేంద్రీయ విద్యాలయం-1లో శనివారం సీ క్యాడెట్ కార్పస్ క్యాంపు ప్రారంభమైంది. విశాఖ రీజియన్‌కు చెందిన విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఇందులో భాగంగా మారిటైం స్కిల్స్, టీమ్ వర్క్, కల్చరల్ ఎక్స్ఛేంజ్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు మారిటైంపై అవగాహన కల్పించేందుకు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోగంటి లెనిన్‌బాబు

ఉద్యోగుల జీతాలపై నిర్లక్ష్యం తగదు

టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు

ఉక్కుటౌన్‌షిప్, మే 18: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల జీతాలపై యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందని, ఇది మంచి పద్ధతి కాదని రాష్ట్ర టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు అన్నారు. ప్లాంట్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం కోసం ఎంతో శ్రమిస్తున్న ఉద్యోగుల జీతాలకు కేవలం రూ.90 కోట్లు మాత్రమే అవుతుందని, అయినా చెల్లింపుల విషయంలో యాజమాన్యం ముందుకు రాకపోవడం శోచనీయమన్నారు. ప్లాంట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం జీతాల చెల్లింపులో ఆలస్యం చోటుచేసుకుంటుందన్నారు. దీనివల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, బ్యాంకులకు ఈఎంఐలు చెల్లించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్లాంట్‌కు అన్ని విధాల కేంద్రం సహాయ, సహకారాలను అందించాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు నమ్మి సింహాద్రి, గుమ్మడి నరేంద్ర, శ్రీకాంత్, కొల్లి శివనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

21న రోళ్ల పైడిమాంబ పండుగ

పెందుర్తి-రూరల్, మే 18: గ్రేటర్ 95వ వార్డు పరిధి చీమలాపల్లి గ్రామస్థుల ఆరాధ్య దేవత రోళ్ల పైడిమాంబ పండుగను ఈ నెల 21న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అమ్మవారి ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. ఇందులో భాగంగా రోజూ ఘటాలను ఊరేగిస్తున్నారు. ఆ రోజున పలు సాంస్కృతిక ప్రదర్శన నడుమ అమ్మవారి అనుపోత్సవాన్ని జరుపుతామని నిర్వాహకులు తెలిపారు.

కథలతో వ్యక్తిత్వ వికాసం పెంపు

పెదగంట్యాడ, మే 18: చారిత్రాత్మక కథలు చదవడం వల్ల విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ పేర్కొన్నారు. ఇక్కడి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం చారిత్రాత్మక కథలను పిల్లలతో చదివించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ రామాయణం, మహాభారతం, భాగవతంలలోని పలు అంశాలు చదవడం వల్ల పిల్లల్లో వ్యక్తిత్వ వికాసం కలుగుతుందన్నారు. ఇలాంటి కథలు సరళమైన భాషలో గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని చదివిన విద్యార్థులు తాము ఆచరించాల్సిన విధానాలు, చేయకూడని పనులు, చేపట్టాల్సిన బాధ్యతల గురించి తెలుసుకోగలుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులతో పాటు పలువురు పాఠకులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటుకు వాటిల్లిన నష్టాన్ని 'గంగవరం పోర్టు' భరించాలి


ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్



దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం, మే 18: స్టీల్‌ప్లాంటుకు వాటిల్లిన నష్టాన్ని గంగవరం పోర్టు యాజమాన్యమే భరించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,192వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగవరం పోర్టు యాజమాన్యం చిన్న సమస్యను పరిష్కరించడంలో వైఫల్యం చెందడం వల్ల స్టీల్‌ప్లాంటుకు సుమారు రూ.పదివేల కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. హార్డ్ కోల్‌ను సకాలంలో అందించని కారణంగా కోక్ ఓవెన్ బ్యాటరీల ఉత్పత్తి తగ్గిందన్నారు. ఇదే తరుణంలో విశాఖ స్టీల్ ఉత్పత్తులు మార్కెట్‌లో లభించకపోవడంతో ఇంతటి సంక్షోభం ఏర్పడిందని పేర్కొన్నారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే మార్కెట్‌లో స్టీలు ప్రజలకు అందుబాటులో ఉండదన్నారు. మూడేళ్లుగా కార్మికులు అవిశ్రాంతంగా పోరాటాలు సాగిస్తున్నందున కేంద్రం ఉక్కు ప్రైవేటీకరణ యోచనను విరమించి, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఆయన కోరారు. కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బ్యాంకులకు ఈఎంఐలు చెల్లించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ ఉక్కు కర్మాగార ఉత్పత్తిని పూర్తి స్థాయిలో కొనసాగిస్తే సుమారు ఆరువేల మందికి ఉద్యోగాలు వస్తాయని, మరో పది మిలియన్ టన్నుల విస్తరణ చేయగలిగితే దాదాపు పదివేల మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. విశాఖ ఉక్కును కాపాడాలన్న చిత్తశుద్ధి రాష్ట్రానికి లేనందునే ప్రస్తుతం ఈ దుస్థితికి చేరిందన్నారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, గణపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





పద్మావతి, శ్రీనివాసుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న రుత్వికులు, స్వామివారికి నమస్కారాలు చేస్తున్న భక్తులు

కమనీయం.. పద్మావతి, శ్రీనివాసుల కల్యాణం

పెందుర్తి, మే 18: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పద్మావతి, శ్రీనివాసుల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పవిత్ర గంగానది జలాలతో స్నానమాచరించాక పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం శ్రీనివాసుడు, పద్మావతి దేవేరులను ముత్యాల పల్లకీలో ఉంచి ఆలయ గర్భగుడిలో ముమ్మార్లు ప్రదక్షణలు చేశారు.

అనంతరం ఆలయ ప్రాంగణంలోని సుదర్శన కల్యాణ మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉత్సవమూర్తులను ఆసీనులు గావించారు. రుత్వికులు వేదమంత్రాలు వల్లించగా సన్నాయి మేళం, మంగళవాయిద్యాల నడుమ పద్మావతి, శ్రీనివాసుని కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. శ్రీవారి కల్యాణ ఘట్టాలను వివరిస్తూ ఆలపించిన అన్నమయ్య కీర్తనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శ్రీనివాసుని కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చిన వందలాది మంది భక్తుల గోవింద నామస్మరణతో వెంకటాద్రి శిఖరం మార్మోగింది.



సింహాచలేశుని దర్శనం కోసం క్యూలో వేచివున్న భక్తులు



అశోక్‌గజపతిరాజును ఆశీర్వదిస్తున్న పండితులు

సింహగిరికి పోటెత్తిన భక్తులు

▸▸ శనివారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో రూ. 52.9 లక్షల ఆదాయం

సింహాచలం, మే 18: వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం పోటెత్తారు. అనూహ్యంగా తరలి వచ్చిన భక్తులతో సింహగిరి జన సంద్రమైంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక్కరోజులోనే స్వామివారి ఖజానాకు రికార్డు స్థాయిలో సుమారు రూ. 52.9 లక్షల ఆదాయం సమకూరింది. వేసవి సెలవులు కావడంతో ఉత్తరాంధ్ర నలుమూలలుతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు, భక్తులు తరలివచ్చారు. వేకువజామున కొండదిగువన వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి సమీపంలోని భైరవ స్వామిని దర్శించుకుని అమృత కలశాలను మొక్కుబడులుగా సమర్పించారు. అక్కడి నుంచి బస్సుల్లో కొందరు, కాలినడకన మెట్లమార్గంలో మరికొందరు సింహగిరికి చేరుకున్నారు. కాగా తలనీలాల టికెట్ల ద్వారా రూ.5.2 లక్షల ఆదాయం రాగా శ్రీఘ్రదర్శనం రూ.100, అతి శ్రీఘ్రదర్శనం రూ.300 టికెట్ల విక్రయాల ద్వారా రూ.32.79లక్షలు, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.12.79లక్షలు, రవాణా, వసతి, విరాళాలు, పలు రకాల ఆర్జిత సేవలు, తదితర వాటి ద్వారా మిగిలిన ఆదాయం సమకూరినట్టు దేవాలయ రికార్డులు చెబుతున్నాయి. భక్తుల సంఖ్య పెరగడంతో ఉదయం 10 గంటల తరువాత ప్రధానాలయం నీలాద్రి గుమ్మం నుంచి లఘు దర్శనం కల్పించారు.

అప్పన్నను దర్శించుకున్న అశోక్‌గజపతిరాజు

సింహాద్రి అప్పన్న స్వామిని దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు దర్శించుకున్నారు. ఆయనకు ఈవో సింగాల శ్రీనివాసమూర్తి పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. అంతరాలయంలో అర్చకులు అశోక్ గోత్రనామాలతో పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలివ్వగా, ఈఓ సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

రెండో విడత చందనం అరగదీత ప్రారంభం

వరాహలక్ష్మీనృసింహస్వామికి పైపూతగా సమర్పించేందుకు అవసరమైన శ్రీచందనం రెండో విడత అరగదీత శనివారం ప్రారంభమైంది. ప్రభాతారాధనలు తరువాత ముందుగా సిద్ధం చేసిన గంధం చెక్కలను స్వామివారి సన్నిధిలో ఉంచి పూజలు చేశారు. ఆలయ నాలుగో తరగతి సిబ్బంది 20 మంది 17 ప్రత్యేక శిలలపై చందనాన్ని అరగదీసే కార్యక్రమాన్ని ప్రారంభించి, ఉదయం 11.30 గంటల వరకు అరగదీశారు. అరగదీసిన చందనపు ముద్దను ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ఏఈవో ఆనందకుమార్ సమక్షంలో తూనిక వేయగా సుమారు 41 కిలోలు రాగా, దానిని ఆలయ పద్మనిధిలో భద్రపరిచారు.

కూటమి విజయం తథ్యం

టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, మే 18: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమని టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. 86వ వార్డు పరిధి మాతృశ్రీనగర్‌లో శనివారం రాత్రి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు గెలుపు తథ్యమని, ఇందుకోసం శ్రమించిన కూటమి నాయకులు, కార్యకర్తలు, బూత్ ఏజెంట్లకు కృతజ్ఞతలు తెలిపారు. కష్టించి పనిచేసే ప్రతి కార్యకర్తకు టీడీపీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. జనసేన పార్టీ వార్డు ఇన్‌చార్జి కాదా శ్రీను మాట్లాడుతూ జనసేనాని పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు అందరూ కూటమి అభ్యర్థుల విజయం ఎంతో శ్రమించారన్నారు. బీజేపీ నాయకుడు బొండా శ్రీదేవి ఎల్లాజీ మాట్లాడుతూ ప్రధాని మోదీ న్యాయకత్వంలో కూటమి విజయం సాధించనున్నదన్నారు. ఈ సమావేశంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, రామారావు, పి.మురళీమోహన్, ఎం,గణపతి, నాగార్జున, జగదీశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులతో పంచకర్ల భేటీ

▸▸ పోలింగ్ సరళిపై చర్చ... విజయంపై ధీమా



సమావేశంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

పరవాడ, మే 18 : జనసేన పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు శనివారం పరవాడ మరిడిమాంబ కల్యాణ మండపంలో జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. జూన్ నాల్గో తేదీన వెలువడే ఎన్నికల ఫలితాల్లో పెందుర్తి నుంచి జనసేన అభ్యర్థిగా తాను విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తామన్నారు. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా ఓటింగ్ సరళి గురించి చర్చించారు. ఏ పంచాయతీలో ఎంత మెజారిటీ వస్తుందో అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, అనకాపల్లి ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ కన్నూరి వెంకటరమణ, 77, 79వ వార్డుల టీడీపీ అధ్యక్షులు మచ్చ శివకుమార్, పాల అచ్చిలనాయుడు, టీడీపీ మండల టీడీపీ వియ్యపు చిన్న, గండి వంశీ, దుల్లా రామునాయుడు, బొద్దపు శ్రీనివాసకాసులు, మోటూరి సన్యాసినాయుడు, బుగిడి రామగోవిందరావు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, పిళ్లా శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్లీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 26, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 30, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 34, బీరకాయలు 46, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 22, క్యారెట్ 28, దొండకాయలు 35, బంగాళదుంపలు 27, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 34, బరబాటి 50, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 44, కీరదోస 26, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 42, కంద 64, దేముడుచిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	138
ఫారం ధర	--	158
విత్ స్కిన్	--	286
స్కిన్‌లెస్	--	296

వైభవంగా కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవం

» 108 స్వర్ణ పుష్పాలతో అభిషేకం

మహారాణిపేట, మే 18: వన్‌టౌన్‌లో 147 సంవత్సరాల చరిత్ర కలిగిన వాసవీ మాత కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా అమ్మవారి జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ అనంతరం క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి రజిత వస్త్రాలంకరణలో 108 స్వర్ణ పుష్పాలతో అభిషేకం గావించారు. 102 మంది మహిళలతో ప్రత్యేక కుంకుమ పూజలు, వాసవి మూల మంత్ర హోమం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం 108 రకాల స్వీట్లు అమ్మవారికి నివేదించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు అరిశెట్టి దినకర్, గ్రంధి రామకృష్ణారావు, సుగ్గు శివకుమార్ శ్రీవాసవి, ఆర్యవైశ్య యువజన సంఘాల ప్రతినిధులు, ఉత్సవ కమిటీలు సభ్యులు పాల్గొన్నారు.


కుంకుమార్చనలో మహిళలు


అమ్మవారికి 108 రకాల స్వీట్లతో నైవేద్యం

ఉచిత కంప్యూటర్, టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

కంచరపాలెం, మే 18: స్థానిక అశోక్‌నగర్‌లోని ఆంధ్ర బౌద్ధాలయంలో పేద విద్యార్థులు, యువత, గృహిణిలకు ఉచిత టైలరింగ్, కంప్యూటర్ శిక్షణను అందించనున్నట్టు బౌద్ధసంఘం ప్రధాన కార్యదర్శి కె. రాజు గణేష్ పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను బౌద్ధాలయంలో ఉదయం 10గంటల నుంచి సాయంకాలం 5గంటల మధ్య అందజేయాలని సూచించారు. దరఖాస్తులకు ఈనెల 25వరకు గడువు ఉందన్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి శిక్షణ తరగతులను ప్రారంభించనున్నామన్నారు.వివరాలకు ఫోన్: 96760 30455ను సంప్రదించాలి.


రథంపై ఉత్సవ విగ్రహం ఊరేగింపు


అమ్మవారి ప్రతిమలతో ఆలయానికి వస్తున్న భక్తులు

ఘనంగా ఎర్నిమాంబ తొలేళ్ల ఉత్సవం

» అమ్మవారి ప్రతిమలతో ఊరేగింపు

» నేడు ప్రధాన పండగ

జ్ఞానాపురం, మే 18: అల్లిపురం అచ్చియ్యమ్మపేట గ్రామస్తుల ఇలవేల్పు సంతాన దేవతగా పేరొందిన ఎర్నిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలేళ్ల ఉత్సవం పురస్కరించుకుని రాత్రి వందకుపైగా అమ్మవారి ప్రతిమలను పూర్ణామార్కెట్ దుర్గాలమ్మగుడి నుంచి కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట మీదుగా ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గుర్రపు రథంపై ఊరేగించారు. ముందుగా ఆలయ ఈవో సురేష్ బాబా, ఆలయ కమిటీ సభ్యులు అచ్చియ్యమ్మ పేట వద్ద నున్న పుట్టబంగారం చెట్టు నుంచి పుట్టమన్ను తీసి అమ్మవారికి సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా అనేక మంది అమ్మవారి మాలధారణ వేసిన భక్తులు ఆలయ వద్ద ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో అమ్మవారి ప్రతిమలు పట్టుకుని నడిచారు. కాన్వెంట్ కూడలి నుంచి జ్ఞానాపురం వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలతో ఆ ప్రాంతం కళకళలాడుతోంది. ప్రధాన పండగ ఆదివారం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

24 నుంచి ఇంటర్ సప్లమెంటరీ

మద్దిలపాలెం, మే 18 : జిల్లా వ్యాప్తంగా ఈనెల 24 నుంచి వచ్చే నెల 1 వరకు ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 నుంచి 12 వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 49 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా అన్ని గదుల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం నుంచి 31,768 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 8,229 మంది పరీక్షలు రాయనున్నారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ మురళీధర్ విలేకరులతో మాట్లాడుతూ సప్లమెంటరీ పరీక్షలకు అన్ని కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పరీక్ష కేంద్రాలకు సెల్‌ఫోన్లు అనుమతించమని, ప్రిన్సిపాల్, ఇన్విజిలేటర్, సిబ్బంది వద్ద ఫోన్లు ఉంటే క్రిమినల్‌చర్యలుతీసుకుంటామనిహెచ్చరించారు. విద్యార్థులకు ఏసమస్య ఉన్నా 0891-2552854, 0891-2567561 ఫోన్ నంబర్‌లో సంప్రతించాలని సూచించారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి


ఎన్‌సీసీ కేడెట్స్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

డాబాగార్డెన్స్, మే 18: చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మంజుల విద్యార్థులకు సూచించారు. ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ షూటింగ్ షిప్- 2023 పాల్గొన్న కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్స్ సీహెచ్ శాంతిఫణి, ఎస్.కిరణ్మయి శనివారం ఆమె అభినందించారు. ఈ క్యాంపు ఈ నెల 3 నుంచి 14 తేదీ వరకు పెద్దాపురం జేఎన్‌వీలో జరిగిన ఈ క్యాంప్‌లో విద్యార్థినులు పాల్గొని మెలకువలు నేర్చుకున్నారన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్స్ కె.గీతాంజలి, ఆర్.కిరణ్మయి పాల్గొన్నారు.

23న అన్‌క్లయిమ్డ్ పార్శిళ్ల వేలం

ద్వారకాబస్‌స్టేషన్, మే 18: ప్రజా రవాణా శాఖ (పీటీడీ) విశాఖ రీజియన్ లాజిస్టిక్ విభాగంలో ఉన్న అన్‌క్లైమ్డ్ పార్శిళ్లను ఈ నెల 23న వేలం వేసేందుకు యాజమాన్యం నిర్ణయించింది. వివిధ ప్రాంతాల నుంచి రీజియన్ లాజిస్టిక్స్ కార్యాలయానికి వచ్చిన పలు పార్శిళ్లను ఎవరూ తీసుకో లేదు. గత ఆరు నెలలుగా కొన్ని పార్శిళ్లు గొడౌన్‌లోనే మగ్గు తున్నాయి. వీటిని 23వ తేదీ ఉదయం 11కు ద్వారకా బస్ స్టేషన్‌లో వేలం నిర్వ హిం చనున్నట్టు రీజనల్ మేనేజర్ అంధవరపు అప్పలరాజు తెలిపారు. ఆసక్తి గలవారు ఈ వేలంలో పాల్గొనాలని కోరారు.

చాలా రోజుల తర్వాత నిష్పక్షపాతంగా పోలీసులు

» అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్


ఆలయం ఎదుట మాట్లాడుతున్న సీఎం రమేష్

తిరుమల, మే 18(ఆంధ్రజ్యోతి): చాలా రోజుల తర్వాత ఏపీలో పోలీసులు కొంతమేర నిష్పక్షపాతంగా పనిచేస్తున్నారని అనకాపల్లి పార్లమెంట్ కూటమి అభ్యర్థి సీఎం రమేష్ అన్నారు. తిరుమల శ్రీవారిని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో పోలీసు యంత్రాంగం యావత్తూ వన్‌సైడ్‌గా పనిచేసిందన్నారు. ఇప్పుడు ఈసీ పుణ్యమా అని పోలీసులు 10 శాతం నిష్పక్షపాతంగా పనిచేస్తుంటేనే వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. కొంతమంది అధికారులు ఇంకా పాత వాసనలోనే ఉన్నారన్నారు. రావణ, రాక్షసరాజ్యం పోయి రామరాజ్యం వచ్చేలా ఆశీర్వదించినందుకు శ్రీవారికి మొక్కు చెల్లించి ధన్యవాదాలు తెలిపేందుకు తిరుమలకు వచ్చానన్నారు. రానున్నరోజుల్లో ఏపీలో ప్రశాంతమైన పాలన నడుస్తుందన్నారు.

ఆచార్య జర్రా అప్పారావుకు చందు సాహిత్య పురస్కారం


పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు

సీతంపేట, మే 18: ఆచార్య చందు సుబ్బారావు లిటరేచరీ, కల్చరల్ ట్రస్ట్ సాహిత్య సేవా పురస్కారం- 2024ను ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జర్ర అప్పారావుకు ప్రదానం చేశారు. శనివారం పౌరగ్రంథాలయంలో ట్రస్ట్ చైర్మన్ కె.ఎస్.చలం అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అప్పారావుకు అవార్డుతో పాటు రూ.10 వేల నగదు, మెమొంటోతో అతిథులు సత్కరించారు. ఆది కవినన్నయ్య విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు, ఆచార్య చందు సుబ్బారావు ఎమ్మెల్సీ ఆచార్య కుంభ రవిబాబు, వి. శిమ్మన్న, డా.డి.ఆర్.కె.రావు, మేడ మస్తాన్‌రెడ్డి, డీవీ సూర్యారావు పాల్గొన్నారు.

చిరంజీవితో గంటా భేటీ..


చిరంజీవికి పుష్పగుచ్ఛమిస్తున్న గంటా శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్, మే 18: మాజీమంత్రి, భీమిలి అసెంబ్లీ కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు శనివారం మెగాస్టార్ చిరంజీవిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చిరంజీవి ఇటీవల పద్మవిభూషణ్ అవార్డు అందుకున్న సందర్భంగా అభినందనలు తెలుపుతూ సన్మానించారు. అనంతరం రాజకీయాలు, సినిమాలు తదితర అంశాలపై చర్చించారు. పోలింగ్ సరళి, ఎన్నికల్లో జనసేనాని పవన్‌కల్యాణ్ ప్రభావం, రాష్ట్ర రాజకీయాలకు సంబంధించిన కీలక అంశాలపై చిరంజీవి ఆరా తీశారు. కొత్తగా నటిస్తున్న సినిమాలపై చిరంజీవి కొంతసేపు ముచ్చటించారు. భీమిలి నుంచి గంటా భారీ మెజార్టీతో గెలవాలని, అంతా మంచిజరిగి రాబోయే కాలంలో ఆంధ్ర అభివృద్ధి పథంలో దూసుకువెళ్లాలని ఈ సందర్భంగా చిరంజీవి ఆకాంక్షించినట్టు గంటా తెలిపారు.

నార్త్‌లో ప్రశాంతంగానే ఎన్నికలు

» వైసీపీ అభ్యర్థి కేకే రాజు



సీతంపేట, మే 18: విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, అధికారులు తగు చర్యలు తీసుకున్నారన్నారు. ఎన్నికల అనంతరం ఈ నియోజకవర్గం పరిధిలో కుటుంబ కలహాలతో జరిగిన ఓ గొడవను వైసీపీపై రుద్దేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నం చేస్తున్నట్టు ఆయన ఆరోపించారు. దీనిపై పోలీసు అధికారులు కూడా విచారణ జరిపి రాజకీయాలకు ఈ గొడవకు ఎటువంటి సంబంధం లేదని ప్రకటించారని చెప్పారు. ప్రజలు ఈ పరిణామాలన్నీ గమనిస్తున్నారని, దీనిపై త్వరలోనే తగిన రీతిలో ఫలితాలనిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

కీలకంగా పోస్టల్ ఓట్లు

... 5వ పేజీ తరువాయి

ఫలితాలను తారుమారు చేసే అవకాశం లేకపోలేదంటున్నారు.

ఎన్నికల్లో ప్రతి ఓటు ఎంతో కీలకం. కొన్నిసార్లు ఒక్క ఓటే ఫలితాన్ని తారుమారు చేస్తోంది. 1989లో కొణతాల రామకృష్ణ అనకాపల్లి నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి సమీప ప్రత్యర్థి పెతకంశెట్టి అప్పలనరసింహంపై కేవలం తొమ్మిది ఓట్ల తేడాతో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో టీడీపీ కేవలం 26 ఓట్ల తేడాతో విజయవాడ సెంట్రల్ సీటును కోల్పోయింది.

టీఎస్ ఎంసెట్‌లో సత్తాచాటిన విశాఖ విద్యార్థులు

... 5వ పేజీ తరువాయి

ఎం.సాయి వివ లోచన్ (72వ ర్యాంకు), ఎం.మణికంఠ పృథ్వీరాజ్ (90), భేరి సాహితి (125), ఆళ్ల రామలింగం నాయుడు (129), తోట ధీరజ్వేర్ (184), కట్టమూరి కుశాల్ (190వ ర్యాంకు) సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో శరగడం పావని 32వ ర్యాంకు, మేకా గాయత్రి 44వ ర్యాంకు, శంబంగి మనో అభిరామ్ 73, జె.సాకేత్‌సాయి 113, సీహెచ్ వేదాంత సంతోష్ 123, టి.సాయి నిఖిలేష్ 149, బి.జయదీప్ 169వ ర్యాంకు సాధించారు. తెలంగాణ ఎంసెట్‌లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను శ్రీచైతన్య ఏజీఎం కేవీ రమణ అభినందించారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్/ఫార్మసీ విభాగాల్లో 10లోపు ఒకరు, 100లోపు ఏడుగురు, 500లోపు 59 మంది ర్యాంకులు సాధించారన్నారు. ఇందుకు కృషిచేసిన కళాశాలల ప్రిన్సిపాళ్లు, డీన్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిని ఆయన అభినందించారు.

మామిడిపై రసాయనాలు

... 5వ పేజీ తరువాయి

ఆర్సినిక్, పాస్పరస్‌లు ఆక్సిజన్‌తో కెమికల్ రియక్షన్ జరిగి ఎసిటిలిన్ అనే గ్యాస్ విడుదలవుతుంది. ఎసిటిలిన్ గ్యాస్ వల్ల మామిడికాయ త్వరగా రంగు మారడంతోపాటు మెత్తపడుతుంది. ఈ ఎసిటిలిన్ అనే గ్యాస్‌ను సాధారణంగా వెల్డింగ్‌కు వినియోగిస్తుంటారు. దీనిని పండ్లను మగ్గబెట్టేందుకు వినియోగిస్తున్నారు. అలా పండించిన పండ్లను తీసుకుంటే ప్రమాదకరమైన కేన్సర్లు బారినపడే అవకాశముంది.

తీవ్రమైన ఆరోగ్య సమస్యలు

రసాయనాలు కలిపిన పండ్లను తీసుకోవడం వల్ల తీవ్ర మైన అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశ ముందని వైద్యులు చెబుతున్నారు. ఈ పండ్లను తీసుకున్న వెంటనే జీర్ణ సంబంధ సమస్యలు కనిపిస్తే, దీర్ఘకాలంలో ప్రమాదకర వ్యాధులకు కారణమయ్యే అవకాశముందని చెబుతున్నారు. కృత్రిమంగా ఎసిటిలిన్ గ్యాస్ వినియోగించి మగ్గబెట్టిన పండ్లను తీసుకుంటే కేన్సర్ బారినపడే అవకాశముంది. రసాయనాలు కలిగిన పండ్లను తినడం వల్ల తలనొప్పి, మైకం, మానసిక గందరగోళం, జ్ఞాపకశక్తి నశించడం, మానసిక స్థితి నిలకడగా లేకపోవడం, నిద్రలేమి, సెరిబ్రల్ ఎడిమా వంటి సమస్యలు ఇబ్బందులకు గురిచేస్తాయని చెబుతున్నారు. వీటితోపాటు మూర్ఛ బారినపడి దీర్ఘకాలంలో హైపోక్సియాను ప్రేరేపిస్తూ శరీర వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపించే అవకాశం ఉంది.

ఇలా గుర్తించాలి

రంగు, రుచి, గుజ్జు, రసం ద్వారా రసాయనాలు కలిపిన పండ్లను గుర్తించవచ్చు. రసాయనాలు చల్లిన పండ్లు సాధారణంగా ముగ్గిన వాటి మాదిరిగా కాకుండా అసహజ ముదురు రంగును కలిగి ఉంటాయి. రుచి తేడాగా ఉంటుంది. చప్పగా ఉంటుంది. కాల్షియం కార్బైడ్ కలిపిన పండ్లను తీసుకున్న ప్పుడు నోటిలో మంటగా ఉంటుంది. వీటిని తిన్న తరువాత కడుపునొప్పి, డయేరియా, గొంతులో మంట ఉంటాయి. సహజంగా పండిన ఫలాలతో పోలిస్తే రసాయనాలు కలిపిన పండ్లలో తగినంత రసం ఉండదు.

స్పెషల్ డ్రైవ్

ఈ నెల 20 నుంచి మామిడి పండ్ల విక్రయాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహణకు ఆహార, భద్రతా ప్రమాణాల శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే తనిఖీలు నిర్వహిస్తున్నారు. పది వరకు నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం పంపించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నమూనాలు సేకరించి తనిఖీలు నిర్వహించనున్నట్టు ఆహార భద్రత, ప్రమాణాల శాఖ జిల్లా అధికారి నందాజీ తెలిపారు. 100 పీపీఎం కంటే ఎక్కువ ఉన్నట్టు తేలితే వ్యాపారులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇథలిన్ 100 పీపీఎం దాటితే జరిమానాతోపాటు రెండేళ్లపాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. కాల్షియం కార్బైడ్ వినియోగించినట్టు తేలితే ఆరు నెలలు జైలుతోపాటు రెండు లక్షల రూపాయల వరకు జరిమానా ఉంటుందన్నారు.

విదేశీ ఉద్యోగాల పేరిట మోసం

... 5వ పేజీ తరువాయి

డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేసేందుకు కంప్యూటర్ నాలెడ్జ్‌తోపాటు ఇంగ్లీష్ మాట్లాడగలిగే 30 మంది కావాలని కోరాడు. విమానం టికెట్లు, వీసా, కాంబోడియాలో వసతి సదుపాయం వంటివి తానే చూసుకుంటానని, ఒక్కొక్కరి నుంచి రూ.90 వేలు వసూలుచేసి అందులో రూ.20 వేలు కమీషన్ కింద తీసుకోవాలని ఆఫర్ ఇచ్చాడు. కాంబోడియా నుంచి జాబ్ స్కామ్‌లు, టాస్కగేమ్ వంటి సైబర్ ఫ్రాడ్స్ చేసే పని వారికి అప్పగిస్తామని రాజేష్‌కు చెప్పాడు. అయితే తక్కువ కాలంలోనే భారీగా సంపాదించే అవకాశం దొరికిందని భావించిన రాజేష్ విశాఖతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతను కాంబోడియాలో ఉద్యోగాలంటూ ఆకర్షించి తొలుత 27 మందిని మూడు దఫాలుగా అక్కడకు పంపించాడు. తర్వాత ఆర్య అనే మహిళ రాజేష్‌ను పరిచయం చేసుకుని సంతోష్ కంటే ఎక్కువ కమీషన్ ఇస్తామని చెప్పింది. ఆమెతోపాటు ఉమామహేష్, హబీబ్ అనే ఏజెంట్లు కూడా పరిచయం అయ్యారు. వీరందరి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా తనను సంప్రతించిన 150 మంది నిరుద్యోగులను రాజేష్ విజిటింగ్ వీసాపై బ్యాంకాక్..అక్కడ నుంచి కాంబోడియా పంపించాడు. అక్కడకు వెళ్లిన తర్వాత ఒక్కొక్కరిని చైనా కంపెనీలకు ఏజెంట్లు 2,500 డాలర్లు నుంచి నాలుగు వేల డాలర్లు చొప్పున విక్రయించారు. ఇలా గత రెండేళ్లలో ఏపీ, తెలంగాణాతోపాటు దేశవ్యాప్తంగా ఐదు వేల మంది పలువురు ఏజెంట్ల ద్వారా కాంబోడియా చేరినట్టు పోలీసులు అంచనా వేస్తున్నారు. వీరందరినీ చైనా ముఠాలు కొనుక్కొని వారికి సైబర్ నేరాలపై శిక్షణ ఇచ్చి భారతీయులకు ఫోన్లు చేయించి మోసాలకు పాల్పడేలా చేస్తున్నాయి. ఎవరైనా ఆ పని చేయబోమంటే చీకటి గదుల్లో పెట్టి చిత్రహింసలకు గురిచేసేవి. ఇలా ఈ ఏడాదిన్నరలో భారతీయుల నుంచి వందల కోట్లు దోచుకున్నాయి. కాగా, కాంబోడియాలో చైనా ముఠా చేతిలో చిక్కుకున్న నగరానికి చెందిన బొత్స శంకర్ అక్కడి నుంచి తప్పించుకుని నగరానికి చేరుకుని 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి సమాచారం అందజేశారు. దీనిపై సీపీ రవిశంకర్ అయ్యన్నార్ ఆదేశాల మేరకు సైబర్‌క్రైమ్ సీఐ కె.భవానీప్రసాద్ లోతుగా దర్యాప్తు చేసి ఉద్యోగాల పేరుతో మానవ అక్రమ రవాణాకు సహకరిస్తున్న గాజువాక ప్రాంతానికి చెందిన చుక్కా రాజేష్‌తోపాటు అతని వద్ద పనిచేస్తున్న సబ్బవరపు కొండలరావు, మన్నేన జ్ఞానేశ్వర్‌లను అరెస్టు చేశారు. కాంబోడియాలో చిక్కుకున్న వారిని విడిపించేందుకు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రిత్వశాఖతో సంప్రతింపులు జరుపుతామని సీపీ తెలిపారు. ఈ సమావేశంలో ఏడీసీపీ ఎం.శ్రీనివాసరావు, సైబర్‌క్రైమ్ సీఐ భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘మేహాద్రి’పై మహా నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గించాల్సి వస్తోంది. ఇదిలావుండగా రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి 50 ఏళ్లు కావస్తున్నా ఇప్పటివరకు ఒక్కసారి కూడా పూడికతీత పనులు చేపట్టలేదు. ఇందుకోసం పదేళ్ల కిందట డ్రెడ్జింగ్ కార్పొరేషన్ అధికారులతో పరిశీలన జరిపించగా సుమారు రూ.50 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే నిధులు ఇచ్చేందుకు జీవీఎంసీ ససేమిరా అనడంతో ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. దీంతో ఏటా రిజర్వాయర్ నీటిమట్టం తగ్గుముఖం పడుతూనే ఉంది.

నిర్వహణలో మహా నిర్లక్ష్యం

వాస్తవానికి మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నిర్వహణ బాధ్యతలు ఇరిగేషన్ శాఖ చూస్తున్నప్పటికీ, అందుకు అవసరమైన నిధులను సమకూర్చే బాధ్యత పూర్తిగా జీవీఎంసీ తీసుకుంది. కానీ కనీస నిర్వహణ కోసం నిధులు మంజూరు చేయకపోవడంతో రిజర్వాయర్ పరిస్థితి అధ్వానంగా మారుతోంది. పూడికతీత పనులు, గట్లు నిర్వహణ, రాతిపేర్పు వంటి పెద్ద పనుల మాటెలా ఉన్నా కనీసం స్పిల్‌వే వద్ద రెండు గేట్లు మరమ్మతుకు గురై నెలలు గడుస్తున్నా జీవీఎంసీ నిధులు మంజూరు చేయకపోవడంతో నీరు వృధాగా పోతోంది. నగరవాసుల తాగునీటి అవసరాలను గుర్తించి, సకాలంలో నిర్వహణ పనులకు నిధులు విడుదల చేయాల్సిన జీవీఎంసీ అధికారులు, పాలకులు తమకు పట్టనట్టు వ్యవహరిస్తుండడమే దీనికి కారణమని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. సకాలంలో గేట్లు మరమ్మతులు చేపట్టకపోతే వర్షాలు కురిసే సమయంలో వరద నీటిని వెంటనే దిగువకు విడుదల చేయాల్సి వస్తోందని, లేదంటే రిజర్వాయర్‌కు ముప్పువాటిల్లే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి రిజర్వాయర్ నిర్వహణ చర్యలు చేపట్టకపోతే నీటి నిల్వలు మరింత దిగజారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

కిర్గిస్థాన్‌లో అల్లర్లతో ఆందోళన

» వైద్యవిద్యను అభ్యసిస్తున్న పలువురు నగర విద్యార్థులు

» హాస్టళ్లపై దాడులతో తల్లిదండ్రుల్లో ఆందోళన

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి): కిర్గిస్థాన్‌లో అల్లర్లు జరుగుతున్న నేపథ్యంలో అక్కడ వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం నుంచి విదేశీ విద్యార్థులు చదువుకునే విద్యా సంస్థలు, హాస్టళ్లపై అక్కడ పౌరులు దాడులు చేస్తున్నారు. రాజధాని బిష్కెక్ (బీఐఎస్‌హెచ్‌కెఈకే)లో గల యూనివర్సిటీలో విశాఖ నగరానికి చెందిన పలువురు వైద్య విద్యనభ్యసిస్తున్నారు. అక్కడ అల్లర్లు జరుగుతున్నట్టు పలువురు విద్యార్థులు...తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. హాస్టళ్లు నుంచి బయటకు రావద్దని శనివారం ఉదయం సంబంధిత యాజమాన్యాలు హెచ్చరించడంతో విద్యార్థులు వణికిపోతున్నారు. కొన్ని మెస్‌లలో ఒక్క పూటే అందించినట్టు నాలుగో సంవత్సరం విద్యార్థిని విశాఖలోని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. దాడులు పెరగవచ్చునన్న వదంతులు వ్యాపించడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కిర్గిస్థాన్‌లోని భారతీయ రాయబార కార్యాలయం అనుమతి లేకుండా ఎవరూ బయటకు రావద్దని విదేశాంగ మంత్రిత్వశాఖ శనివారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో విద్యార్థులను కిర్గిస్థాన్ పంపించిన కన్సల్టెన్సీల ప్రతినిధులను పలువురు తల్లిదండ్రులు సంప్రతించగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

ఎన్నికల నిర్వహణకు రూ.12 కోట్లు విడుదల

... 5వ పేజీ తరువాయి

పంపిణీ సమయంలో ఏయూలో టెంట్లు, కుర్చీలు ఏర్పాటుచేశారు. సిబ్బందికి అల్పాహారం, భోజనం అందించారు. ఇంకా స్ట్రాంగ్‌రూమ్‌ల సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు కేటాయించారు. తొలివిడత ఇచ్చిన నిధులు ఖర్చు చేసిన తరువాత రెండో విడతలో మిగిలిన నిధులు విడుదల చేస్తారని భావిస్తున్నారు.

నూజివీడు వద్ద రోడ్డు ప్రమాదం: విశాఖ వాసులకు గాయాలు

నూజివీడు టౌన్, మే 18: పెట్రోల్ ట్యాంకర్ టైర్ పేలి ట్యాంకర్, ఆటో ఢీకొనడంతో ఐదుగురికి తీవ్ర గాయాలైన ఘటన ఏలూరు జిల్లా నూజివీడు మండలం మీర్జాపురం వద్ద చోటుచేసుకుంది. నూజివీడు నుంచి ఏలూరు వెళుతున్న పెట్రోల్ ట్యాంకర్ మీర్జాపురం వద్ద ముందు భాగంలోని ఎడమ టైర్ పేలి పోవడంతో ట్యాంకర్ అదుపుతప్పి హనుమాన్ జంక్షన్ నుంచి నూజివీడు వస్తున్న ఆటోను ఢీ కొంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న విశాఖ పట్నం గాంధీనగర్‌కు చెందిన కురందాస్ గోవింద్, కురందాస్ ఆదిలక్ష్మీ, కురందాస్ రత్నం, అరసా ప్రసాద్‌తో పాటు తణుకు మండలం పైడిపర్రుకు చెందిన దూళ్ల నాగపెద్దిరాజు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో 108 సిబ్బంది క్షతగాత్రులను నూజివీడుఏరియా ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు.

సీపీ అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదు: విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, మే 18: కప్పరాడ బర్మాక్యాంప్‌లో వైసీపీ మూకల దాడిలో గాయపడిన బాధితులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్‌ను కలిసేందుకు ప్రయత్నిస్తుంటే ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదని ఉత్తర నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పెనుమత్స విష్ణుకుమార్‌రాజు తెలిపారు. గత మూడు రోజులుగా సీపీని పలుమార్లు కోరినా అపాయింట్‌మెంట్ ఇచ్చేందుకు నిరాకరిస్తున్నట్టు విష్ణుకుమార్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సెలవు కావడంతో కనీసం సోమవారం అయినా అపాయింట్‌మెంట్ దొరుకుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలు జరిగిపోయినా అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంశోచనీయమనిఆయన విచారం వ్యక్తం చేశారు.

మద్యం మత్తులో ట్రాఫిక్ పోలీసులపై యువకుడు దాడి

మర్రిపాలెం, మే 18: ఎన్ఏడీ జంక్షన్‌ఫ్లైఓవర్ కింద మార్గంలో ట్రాఫిక్ పోలీసులపై యువకుడు దాడికి పాల్పడిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ట్రాఫిక్ పోలీసులు, లాఅండ్ ఆర్డర్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఎన్ఏడీ ఫ్లైఓవర్ కింద మార్గంలో రాత్రి ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై రావడంతో వారిని నిలిపి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేయడానికి సిద్ధమయ్యారు. ఇంతలో ఒకరు బైక్ దిగి పారిపోయాడు. మిగిలిన ఇద్దరు యువకుల్ని ఆపి వివరాలు సేకరించే ప్రయత్నం చేశారు. ఇంతలో ఇద్దరిలో చరణ్‌రాజ్ అనే యువకుడు పోలీసులపై దాడికి పాల్పడ్డాడు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలకు సహకరించలేదు. యువకుడిని నిలువరించేందుకు యత్నించిన హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ కాలర్ పట్టుకుని దుర్భాషలాడుతూ హల్‌చల్ చేశారు. దీంతో ఆయువకుడిని అదుపు లోకి తీసుకుని ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. వీరిపై విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడినందుకు, మద్యంసేవించి వాహనం నడిపినందుకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మరికొన్ని ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విశాఖపట్నం, మే 18: వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా నడుస్తున్న మరికొన్ని ప్రత్యేక రైళ్లను కొద్ది రోజులపాటు పొడిగిస్తున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. దీనిలో భాగంగా సంబల్‌పూర్-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను (08321) ఈనెల 30 నుంచి జూన్ 27 వరకు, ఎస్ఎంవీ బెంగళూరు-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను (083 22) జూన్ ఒకటి నుంచి 29 వరకు, సంబల్‌పూర్- కాచీగూడ ఎక్స్‌ప్రెస్ ను (08325) ఈనెల 27 నుంచి జూన్ 24 వరకు, కాచీగూడ-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను (08326) ఈనెల 28 నుంచి జూన్ 25 వరకు పొడిగించినట్టు ఆయన పేర్కొన్నారు.

మళ్లింపు మార్గంలో హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్

అంబాల డివిజన్‌లోని శంభుస్టేషన్ వద్ద కిసాన్ ఉద్యమం జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 21న విశాఖ నుంచి అమృతసర్ వెళ్లే హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (20807), తిరుగు ప్రయాణంలో ఈనెల 22న అమృతసర్ నుంచి విశాఖ వచ్చే హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (20808) రైళ్లు వయా ఉత్తర రైల్వేలోని జఖాల్, ధురి, లుధియానా మీదుగా మళ్లింపు మార్గంలో రాకపోకలు సాగిస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైళ్లు రాను పోను మార్గంలోని పానిపట్, అంబాల స్టేషన్లకు చేరవని పేర్కొన్నారు.

రేపు జోన్-2 పరిధిలో తాగునీటి సరఫరా నిలిపివేత

కొమ్మాది, మే 18 : జీవీఎంసీ జోన్-2 పరిధిలోని పలు ప్రాంతాలకు సోమవారం తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్టు కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బోని గ్రామం వద్ద గోస్తనీ హెడ్ వాటర్ వర్క్సు నుంచి తగరపువలస వరకు కొత్తగా 400 ఎంఎం పైపులైన్ వేస్తున్నామని చెప్పారు. ఈమేరకు జోన్-2 పరిధిలోని బోయిపాలెం, హౌసింగ్ కాలనీ, పరదేశిపాలెం, ఈడబ్ల్యూఎస్ కాలనీ, పరదేశిపాలెం విలేజ్, పిపి 2 హౌసింగ్ కాలనీ, సాయిరాం కాలనీ, జీసీసీ లేఅవుట్ ఫేజ్ 2 అండ్ 3, భగవాన్‌దాస్ కాలనీ, రేవళ్లపాలెం, ఎంఎస్ ఆర్ లేఅవుట్, సంపత్‌నగర్, సాయిప్రియా లేవుట్, గాయత్రి నగర్ హౌసింగ్ కాలనీ, పీఎంపాలెం మొదటి బస్టాప్, స్టేడియం వెనుక ప్రాంతాలకు తాగునీటి సరఫరా జరగదన్నారు. ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని, అవసరమైన వారు సంబంధిత అధికారులను సంప్రతించాలని ఆయన సూచించారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



సింహాచలం, మే 18 : వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాత అరాధనలు పూర్తి చేశారు.ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. నృసింహ సహస్ర శతనామావళి పఠిస్తూ తులసీ దళాలతో అర్చన చేసి, పాంచ రాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాల్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

బీవీకే కళాశాలలో అడ్మిషన్లు

విశాలాక్షినగర్, మే 18 : జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో ఉన్న భారతీయ విద్యా కేంద్రం (బీవీకే) జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఆచంట రమా తెలిపారు. శనివారం ఆమె తన కార్యాలయంలో కళాశాలలో ప్రవేశాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలతో కళాశాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనుభవం ఉన్న లెక్చరర్లు, తక్కువ ఫీజులతో అత్యుత్తమ బోధన అందిస్తున్నామన్నారు. ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ కోర్సులు నిర్వహిస్తున్నామని వివరించారు.

రేపటి నుంచి అన్నమయ్య సంకీర్తన శిక్షణ తరగతులు

విశాలాక్షినగర్, మే 18 : హనుమంతవాక కూడలి నుంచి విశాలాక్షినగర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న భక్తతుకారాం రామాలయంలో టీటీడీ ఆస్థాన గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు అన్నమయ్య సంకీర్తన శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు కొండవీటి జ్యోతిర్మయి సెంట్రల్ ట్రస్టు విశాఖపట్నం కో-ఆర్డినేటర్ దుర్గా ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిరోజూ ఉదయం ఏడు నుంచి తొమ్మిది వరకు తరగతులు జరుగుతాయని, ఆరేళ్ల చిన్నారుల నుంచి 90 ఏళ్ల వయస్సు ఉన్న వారు కూడా హాజరుకావచ్చునని చెప్పారు. అదే తేదీల్లో గాజువాకలోని వడ్లపూడిలోని కణితి కాలనీలో ఉన్న గవర రామాలయంలో ప్రతిరోజూ సాయంత్రం 7 నుంచి రాత్రి 9 వరకు అన్నమయ్య సంకీర్తన శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు.

పరిపాలనా విభాగాలు పరిశీలన

వెంకోజీపాలెం, మే 18 : ఏయూ పరిపాలనా భవనంలోని పలు విభాగాలను రిజిస్ట్రార్ ఎం. జేమ్స్ స్టీఫెన్ శనివారం పరిశీలించారు. పరిపాలనా విభాగంలో సేవలందిస్తున్న ప్రతి విభాగాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, సంబంధిత సిబ్బందితో మాట్లాడారు. కార్యాలయాల ఆధునికీకరణ, అవసరమైన మార్పులు తదితర అంశాలపై సిబ్బంది సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఆయనతో పాటు డీఆర్ సాంబమూర్తి, ఏఆర్ గంట గోపాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 26, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 30, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 34, బీరకాయలు 46, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజ్ 22, క్యారేట్ 28, దొండకాయలు 35, బంగాళా దుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 150, బరబటి 50, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 44, కీరదోస 26, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్ర పెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	138
ఫారం ధర	--	158
విత్ స్కిన్	--	286
స్కిన్‌లెస్	--	296



సింహాచలం కూడలిలో నిలిచిన వాహనాలు



ఆలయంలో భక్తుల రద్దీ

సింహగిరికి పోటెత్తిన భక్తులు

» ఒక్కరోజే రికార్డు స్థాయిలో రూ. 52.9 లక్షల ఆదాయం

సింహాచలం,మే 18 : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం పోటెత్తారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో సింహగిరి జన సంద్రమైంది. ఒక్క రోజులోనే స్వామివారి ఖజానాకు సుమారు రూ. 52.9 లక్షల ఆదాయం సమకూరింది. వేసవి సెలవులు కావడంతో ఉత్తరాంధ్ర నలుమూలలుతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వేకువజామున కొండదిగువన వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి సమీపంలోని భైరవ స్వామిని దర్శించుకుని అమృత కలాశాలను మొక్కుబడులుగా సమర్పించారు. అక్కడి నుంచి బస్సుల్లో కొందరు, కాలినడకన మెట్ల మార్గంలో మరికొందరు సింహగిరికి చేరుకున్నారు. కాగా తలనీలాల టికెట్ల ద్వారా రూ.5.2 లక్షల ఆదాయం రాగా శ్రీఘ్రదర్శనం రూ.100, అతి శ్రీఘ్రదర్శనం రూ.300 టికెట్ల విక్రయాల ద్వారా రూ.32.79లక్షలు, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 12.79 లక్షలు, రవాణా, వసతి, విరాళాలు, పలు రకాల ఆర్జిత సేవలు, తదితర వాటి ద్వారా మిగిలిన ఆదాయం సమకూరినట్టు అలయ అధికారులు తెలిపారు. భక్తుల రద్దీ పెరగడంతో ఉదయం 10 తరువాత ప్రధానాలయం నీలాద్రి గుమ్మం నుంచి లఘు దర్శనం కల్పించారు.

ఎక్కడికక్కడ స్తంభించిన ట్రాఫిక్

వరాహలక్ష్మీనృసింహస్వామి భక్తులు తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం స్వామివారి దర్శనానికి అనూహ్యంగా భక్తులు పోటెత్తారు. చాలామంది సొంత వాహనాలతో రావడంతో కొండ దిగువన, ఘాట్ రోడ్డులో పలుమార్లు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. ఉదయం 7 గంటల నుంచి దేవస్థానం అధికారులు కొన్ని వాహనాలను కొండదిగువనే తాత్కాలికంగా నిలుపుదల చేసి సింహగిరిపై ఖాళీ ఏర్పడిన తరువాత వాటిని వదిలిపెట్టారు. అలాగే గోపాలపట్నం ట్రాఫిక్ విభాగం నుంచి సుమారు 20 మందికిపైగా ట్రాఫిక్ కానిస్టేబుళ్లు వాహనాల రాకపోకలను నియంత్రించి ట్రాఫిక్ సమస్యలను అరికట్టేందుకు ప్రయత్నించారు. అయినా ఇబ్బందులు తప్పలేదు. నూతన ఈవీ (ఏసి) బస్సులో సింహగిరికి బయలుదేరిన అశోక్‌గజపతిరాజు,ఈఓ శ్రీనివాసమూర్తి కూడా 30 నిమిషాల పాటు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయారు.సింహగిరిపై భక్తుల వాహనాలకు అవసరమైన స్థాయిలో పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో కొన్ని కార్లను కొండపై ఎక్కడపడితే అక్కడే అడ్డదిడ్డంగా నిలిపివేస్తుండడంతో తరచూ సమస్య తలెత్తుతోంది.

అప్పన్నను దర్శించుకున్న అశోక్ గజపతిరాజు

సింహాచలం, మే 18 : వరాహలక్ష్మీనృసింహస్వామిని సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు శనివారం దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయం ఈఓ శ్రీనివాసమూర్తి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అంతరాలయంలో అర్చకులు అశోక్ గోత్రనామాలతో పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.



అశోక్‌ను ఆశీర్వదిస్తున్న పండితులు

వైసీపీ నాయకులపై ఫిర్యాదు

పద్మనాభం, మే 18 : ఎన్నికల సందర్భంగా ఈనెల 13న తనపై దాడి చేసిన వైసీపీ నాయకులపై మాజీ ఎంపీపీ డి. గోపాలకృష్ణమూర్తిరాజు పద్మనాభం పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. పోలింగు రోజున తాను రెడ్డిపల్లి-కోరాడ రోడ్డులో వెళ్తుండగా రెడ్డిపల్లి ఎంపీపీ పాఠశాల వద్ద జెడ్పీటీసీ సభ్యుడు ఎస్. గిరిబాబు తన అనుచరులతో కలిసి దాడికి ప్రయత్నించారని ఆరోపించారు. గతంలో ల్యాండ్ పూలింగ్‌లో రైతుల తరఫున నిలబడి పోరాటం చేసినప్పుడు కూడా జెడ్పీటీసీ దాడి చేశారని తెలిపారు. తనకు వారి నుంచి ప్రాణహాని ఉందని, న్యాయం చేయాలని సీఐ శ్రీధర్‌ను కోరారు.

రెండో విడత చందనం అరగదీత ప్రారంభం

సింహాచలం, మే 18 : వరాహలక్ష్మీ నృసింహస్వామికి పైపూతగా సమర్పించేందుకు అవసరమైన శ్రీచందనం రెండో విడత అరగదీత శనివారం ప్రారంభమైంది. ప్రభాతారాధనలు తరువాత ముందుగా సిద్ధం చేసిన గంధం చెక్కలను అంతరాలయంలో స్వామివారి సన్నిధిలో ఉంచి పూజ చేశారు. అనంతరం ఆలయ నాల్గవ తరగతి సిబ్బంది 20 మంది 17 ప్రత్యేక శిలలపై చందనాన్ని అరగదీసే కార్యక్రమాన్ని ప్రారంభించి, ఉదయం 11.30 గంటల వరకు అరగదీశారు. సిబ్బంది అరగదీసిన చందనపు ముద్దను ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ఏఈఓ ఆనందకుమార్ సమక్షంలో తూనిక వేయగా సుమారు 41 కిలోలు రాగా దాన్ని ఆలయ పద్మనిధిలో భద్రపరిచారు.



చందనం అరగదీస్తున్న సిబ్బంది

సమస్యల పరిష్కారానికి చర్యలు

కొమ్మాది, మే 18 : మధురవాడ ప్రాంతంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృషి చేయనున్నట్టు ఆ సంఘం మధురవాడ అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాష్ తెలిపారు. శనివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ఫ్లైఓవర్ కింద నీరు నిల్వ లేకుండా చర్యలు, ట్రాఫిక్ ఇబ్బందుల తొలగింపు, పౌర గ్రంథాలయం నిర్మాణం, ప్రభుత్వ వైద్య శాలలో సిబ్బంది కొరత తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తీర్మానించామన్నారు. అయనతో పాటు ఆ సంఘం సభ్యులు పోలిశెట్టి నాగేశ్వరరావు, యల్లపు ఈశ్వరరావు, బ్రహ్మాజి, జగన్మోహనరావు ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం



టీయూ-142 వద్ద సందర్శకులతో పర్యాటక శాఖ అధికారులు

ఎంవీపీ కాలనీ, మే 18 : అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ నగరంలోని వివిధ మ్యూజియంలకు వచ్చిన సందర్శకులతో శనివారం మాటా మంతి కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లా పర్యాటక శాఖాధికారిణి జ్ఞానవేణి ఆధ్వర్యంలో సిబ్బంది ముందుగా సీహారియర్ మ్యూజియం, టీయూ -142, కురుసుర సబ్‌మెరైన్, మారిటైం, ఆర్కియాలజీ, తెలుగు మ్యూజియంలను సందర్శించారు.ఈసందర్భంగా జ్ఞానవేణి మాట్లాడుతూ ఈ ఏడాది మ్యూజియం ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ అన్న థీమ్‌తో ప్రచారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నగరంలో ఉన్న అన్ని మ్యూజియంలు పూర్తి విజ్ఞానదాయకమైనవని పేర్కొన్నారు. ఈమేరకు మ్యూజియంలకు వచ్చిన సందర్శకులతో మాట్లాడి, వారి సలహాలు, సూచనలు స్వీకరించారు.

కిటకిటలాడిన శ్రీవారి ఆలయం



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

సాగర్‌నగర్, మే 18 : రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో శనివారం కిటకిటలాడింది. వేసవి సెలవులు, శ్రీవారి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు ఆలయానికి పోటెత్తారు. వేకువజామున స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.

రిజర్వాయర్‌లో ఈతకు దిగిన యువకుడి మృతి

గోపాలపట్నం, మే 18 : మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ స్పిల్‌వే దిగువన ఈతకు దిగిన ఓ యువకుడు నీటిలో మునిగి మృతి చెందాడు. పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని సీతంపేట, రెల్లివీధి ప్రాంతానికి చెందిన కొందరు యువకులు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో ఈత కోసం శనివారం మధ్యాహ్నం వచ్చారు. వీరంతా రిజర్వాయర్ స్పిల్‌వే దిగువ ప్రాంతంలో ఈతకు దిగిన సుర పవన్ (20) అనే యువకుడు నీటిలో మునిగిపోయాడు. ఈమేరకు రిజర్వాయర్ సిబ్బంది పెందుర్తి పోలీసులకు సమాచారం అందించడంతో వారు గజ ఈతగాళ్ల సాయంతో గల్లంతైన యువకుని గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో పవన్ మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పవన్ మృతదేహం

నృసింహవనంలో వాటర్ గన్స్ ఏర్పాటు

సింహాచలం, మే 18 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన నృసింహవనంలో సేంద్రియ వ్యవసాయం కోసం ఏర్పాటు చేసిన స్ప్రింకల్ వాటర్ సిస్టమ్‌ను దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ సుమారు రూ.9 లక్షలతో 65 వాటర్ గన్‌లను ఏర్పాటు చేసామని, వాటితో పది ఎకరాలకు నీరు పెట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన వ్యవసాయ కమతంలో గోశాలలోని గోవులకు మేలు రకం గడ్డి పెంచాలని నిర్ణయించామని చెప్పారు. కార్యక్రమంలో గోశాల ఇన్‌చార్జి పర్యవేక్షణాధికారి అప్పారావు, డీఈఈ రామరాజు (హరి), తదితరులు పాల్గొన్నారు.

సివిలియన్ ఇంజనీర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశమైన ఎంఈఎస్ సివిలియన్ ఇంజనీర్లు

వెంకోజీపాలెం, మే 18 : ఎంఈఎస్‌లో పనిచేస్తున్న సివిలియన్ ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఆ సంఘం విజ్ఞప్తి చేసింది. శనివారం ఆల్ ఇండియా ఎంఈఎస్ సివిలియన్ ఇంజనీర్స్ అసోసియేషన్ విశాఖ ఎంఈఎస్ హెడ్ క్వార్టర్స్ కార్యవర్గ సమావేశం శనివారం స్థానిక పౌర గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు కె. రాధాకృష్ణ, కార్యదర్శి సంజీవ్ సుమన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల తమకు ఏఈ నుంచి ఈఈ ఇంజనీర్ క్యాడర్ వరకు ప్రమోషన్లు ఇచ్చేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమన్నారు. తమ ప్రాంతంలో దాదాపు 124 మంది పదోన్నతులు పొందారని తెలిపారు. సర్వేయర్లకు ఇంజనీరింగ్‌తో అనుసంధానం చేస్తూ వారికి ప్రమోషన్ కల్పించాలని కోరారు. గ్రేడ్ పే విధానంలో అతి తక్కువ బెనిఫిట్స్ పొందుతున్న తమకు గ్రేడ్ పే మొత్తాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే సివిలియన్లకు టైప్ త్రీ, టైప్ ఫోర్ క్వార్టర్లు నిర్మించాలని, ఏఈలకు సీఈ కార్యాలయంలో మెస్ ఏర్పాటు చేయాలని, వివిధ ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన వారికి తాత్కాలిక వసతి కల్పించేందుకు భవనాలు నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు ఎస్కే చతుర్వేది, నితీస్ కుమార్ సింగ్, ఫైనాన్స్ సెక్రటరీ చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్వీపీ గణేష్, జాయింట్ సెక్రటరీ లవకుశ జైస్వాల్ సూరబ్ గుప్తా పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

ఆరిలోవ, మే 18 : గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులపై ఆరిలోవ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పాత డెయిరీ ఫారానికి సమీపంలో ఉన్న ఇందిరానగర్‌లో తమను చూసి పారిపోతున్న ఇద్దరు యువకులను ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని సోదా చేయగా సుమారు అర కిలో గంజాయి లభించింది. వారు అల్లిపురం ప్రాంతానికి చెందిన పాత నేరస్తులని సీఐ గోవిందరావు చెప్పారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అనారోగ్యంతో మంగమారిపేట హెచ్‌ఎం మృతి

భీమునిపట్నం, మే 18 : మండలంలోని మంగమారిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మెహర (59) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విశాఖలో ఉంటున్న ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె మృతి పట్ల ఉపాధ్యాయులు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.



సీ క్యాడెట్ కార్ప్స్ క్యాంప్ ప్రారంభం

విశాఖపట్నం, మే 18 : విశాఖ నౌసేనాబాగ్ కేంద్రీయ విద్యాలయం-1లో శనివారం సీ క్యాడెట్ కార్ప్స్ క్యాంప్ ప్రారంభమైంది. విశాఖ రీజియన్‌కు చెందిన విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఇందులో భాగంగా మారిటైం స్కిల్స్, టీమ్ వర్క్, కల్చరల్ ఎక్స్ఛేంజ్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు మారిటైంపై అవగాహన కల్పించేందుకు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.

స్టీల్‌ప్లాంటుకు వాటిల్లిన నష్టాన్ని 'గంగవరం పోర్టు' భరించాలి

కూర్మన్నపాలెం, మే 18 : స్టీల్‌ప్లాంటుకు వాటిల్లిన నష్టాన్ని గంగవరం పోర్టు యాజమాన్యమే భరించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,192వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గంగవరం పోర్టు యాజమాన్యం చిన్న సమస్యను పరిష్కరించడంలో వైఫల్యం చెందడం వల్ల స్టీల్‌ప్లాంటుకు రూ.పది వేల కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. హార్డ్ కోల్‌ను సకాలంలో అందించకపోవడంతో కోక్ ఓవెన్ బ్యాటరీల ఉత్పత్తి తగ్గిందన్నారు. అదే సమయంలో విశాఖ స్టీల్ ఉత్పత్తులు మార్కెట్‌లో లభించకపోవడంతో ఇంతటి సంక్షోభం ఏర్పడిందని చెప్పారు. కర్మాగారాన్ని ప్రైవేటుకు అప్పగిస్తే మార్కెట్‌లో స్టీలు ప్రజలకు అందుబాటులో ఉండదని, కార్మికుల పోరాటం దృష్ట్యా కేంద్రం ప్రైవేటీకరణ యోచన విరమించుకోవాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న కమిషన్ సభ్యులు, అధికారులు

'బాలల హక్కులను పరిరక్షిద్దాం'

ఆరిలోవ, మే 18 : బాలల హక్కుల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పేర్కొన్నారు. శనివారం పైనాపిల్ కాలనీలో ఉన్న మహిళా ప్రాంగణంలో ఆరు జిల్లాల పరిధిలోని కమిషన్ సభ్యులు సమావేశమయ్యారు. సమావేశానికి కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అధ్యక్షత వహించారు. ముందుగా ఆరు జిల్లాల్లో ఇప్పటివరకు నమోదైన బాల్య వివాహాలు, పోలీసు కేసులు, గ్రామస్థాయిలో బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన వంటి అంశాలపై చర్చించారు. అనంతరం చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాంతాల వారీగా సమీక్షలు జరిపి, సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. సమావేశంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆరు జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్ చిన్మయదేవి, శ్రీకాకుళం జిల్లా సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, విశాఖ జిల్లా చైర్‌పర్సన్ ఎంఆర్ఎల్ అనూరాధ, విజయనగరం జిల్లా నుంచి ఎస్. చిట్టిబాబు, ఐసీడీఎస్ శ్రీకాకుళం పిడి బి. శాంతి, మన్యం పార్వతీపురం జిల్లా పిడి కుమారి, విజయనగరం జిల్లా పిడి సూర్యకుమారి, ఆరు జిల్లాల బాలల సంరక్షణ అధికారులు రమణ, లక్ష్మి, నాగరాజు, నాయుడు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ ఆలయం హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సిరిపురం, మే 18 : సిరిపురంలోని సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపు శనివారం చేపట్టారు. గత 23 రోజులకు గాను రూ.15,31,839 నగదు, వెండి 171 గ్రాములు, యూఎస్ఏ డాలర్స్ 90, సింగపూర్ డాలర్స్ 10, ఎస్‌బీఐ చెక్కు రూ.111 వచ్చినట్టు దేవాదాయ శాఖ ఉప కమిషనర్ ఎస్.సుజాత చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్, శివజ్యోతి, వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, డిప్యూటీ కమిషనర్ అండ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మాన్సాస్ ట్రస్ట్ ప్రసాద్, బి. వసంతకుమార్, దేవాలయ సిబ్బంది ప్రసాద్, గోవింద రెడ్డి, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారం విద్యుత్ కోతలు

పద్మనాభం (రూరల్), మే 18 : మండలంలో కొద్ది రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలు అమలవుతు న్నాయి. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా ఇష్టానుసారం కోతలు విధిస్తున్నారు.అసలే వేసవి కావడం, దీనికితోడు వేళాపాళా లేకుండా కోతలు విధిస్తుండడం వల్ల ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంది. అలాగే విద్యుత్ కోతల వల్ల చిరు వ్యాపారులు కూడా వ్యాపారాలు ముందుకు సాగక ఇబ్బందులు పడుతున్నారు.

160 మందికి నేత్ర వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తగరపువలస, మే 18 : స్థానిక సాయి రవీంద్ర పాఠశాల ఆవరణలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 160 మందికి పరీక్షలు చేసి 40 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. మిగిలిన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వీఎస్ఆర్ సంస్థ, నీడీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు

భీమునిపట్నం, మే 18 : పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. ఈమేరకు వేకువజామున పూజలు, అభిషేకాలు అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.